INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక

జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

శుక్రవారం 23.08.2024
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 సంచిక -186 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## సిగ్గుపడాలి



- పరిశ్రమల శాఖ పాపాలకు ప్రతిఫలమే ఈ చావులు
- కంపెనీల్లో ప్రాణాలకు విలువ లేని పరిస్థితి
- పరిశ్రమల శాఖ తీరుపై సర్వత్రా విమర్శలు
- కనీస సౌకర్యాలు లేని ప్రాంతాల్లో పరిశ్రమలకు అనుమతులు
- ప్రమాదాలు జరిగినప్పుడే చర్చ.. మళ్లీ తెరపైకి సేఫ్టీ ఆడిట్..

**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ):** చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు అన్న చందంగా మారింది పరిశ్రమల శాఖ తీరు. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే సేఫ్టీ ఆడిట్ అంటూ పలుమార్లు ప్రకటన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు.. ఆ తరువాత ఆ మాటే మరిచిపోతున్నారు. కనీస సౌకర్యాలు కూడా లేకుండా ఉన్న ప్రాంతాల్లో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం ఇప్పుడు పలు ఆరోపణలకు తావిస్తోంది. పరిశ్రమలు ఏర్పాటు

2 లో

## వదిలిపెట్టం

# కమిటీ వేస్తున్నాం... దోషులను శిక్షిస్తాం

- అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటనాస్థలిని పరిశీలించిన సీఎం చంద్రబాబు
- విశాఖలోని మెడికవర్, కేజీహెచ్ ఆస్పత్రుల్లో క్షతగాత్రులను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- ఫార్మా ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు..
- ధైర్యంగా ఉండాలని.. ప్రభుత్వం అన్ని చూసుకుంటుందని బాధితులకు సీఎం భరోసా..
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన..
- అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తాం
- ఫార్మా ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం.
- తీవ్ర గాయాలైన వారికి రూ.50 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు
- జిల్లా అధికారులు, మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష.



**అనకాపల్లి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు ఎంత అవసరమో.. కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటించడం అంతే అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. అనకాపల్లి జిల్లాలో పర్యటించిన ఆయన అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జిల్లాకు చెందిన అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రమాదకరం చాలా బాధాకరమని, దురదృష్టకరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఎసెన్షియా ఫార్మా రెడ్ కేటగిరీ పరిశ్రమని, ఈ ప్రమాదంలో17మంది చనిపోయారన్నారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం కింద చెక్కులు ఇవాళే పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పరిహారాన్ని కంపెనీ ద్వారానే చెల్లిస్తున్నామన్నారు. వేపర్ క్లౌడ్ ఎక్స్ ప్లో జన్ కారణంగా ప్రమాదం జరిగిందన్నారు. కంపెనీ సరైన ఎస్‌వోపీ ఫాలో అవ్వలేదని స్పష్టమవుతుందన్నారు. సరైన భద్రతా చర్యలు తీసుకోలేదని, పరిశ్రమలు తప్పులు చేస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో చూశామన్నారు. మృతుల

2 లో

## చాలా బాధ కలిగించింది

- ప్రమాద బాధితులకు అండగా ఉంటాం
- ఇటువంటి సంఘటనలు పునరావృతం కానివ్వం
- అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో ప్రమాదంపై మంత్రి సత్యకుమార్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం చాలా బాధ కలిగించిందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. గురువారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో దాదాపు 17 మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది క్షతగాత్రులు కావడంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందన్నారు. వెంటనే సీఎం అక్కడికి అధికారులను పంపారన్నారు. సంబంధిత అధికారులు అక్కడ సహాయక చర్యలు చేపట్టారని మంత్రి తెలిపారు.

35 మంది వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారని సత్యకుమార్ అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇటువంటి ప్రమాదాల వల్ల పాఠాలు నేర్చుకుని మళ్లీ జరగకుండా చూడాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలను ప్రధాని ప్రకటించారన్నారు.

ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందని ఆయన వివరించారు. సీఎం చంద్రబాబు స్వయంగా అక్కడకు చేరుకుని వారితో మాట్లాడుతున్నారని, ఇటువంటి ఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి తెలిపారు.




### రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో

# ఒకే రోజు గ్రామ సభలు

- దేశంలోనే మొదటిసారి భారీ స్థాయిలో ఒకే రోజు గ్రామ సభల నిర్వహణ
- ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500 కోట్ల నిధులతో, 87 రకాల పనులకు ఆమోదం
- 9 కోట్ల పని దినాలు, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పన
- స్వయంసమృద్ధితో పంచాయతీలు కళకళలాడాలి
- గ్రామాలకు ఆదాయం, అభివృద్ధి పెంచేలా ప్రణాళిక
- సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేపడతాము
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల ప్రచార



వివరాలు 2 లో

సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తామని మాటిచ్చాం. దాని ప్రకారమే పంచాయతీలు సుసంపన్నం కావాలనే సుదూర లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం ముందడుగు వేస్తున్నామ'ని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలను నిర్వహించి,

## ఛత్తీస్‌ఘడ్ జర్నలిస్టులపై కేసును పునఃపరిశీలించాలి




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం హయాంలో బస్తర్‌లో నలుగురు ఛత్తీస్‌ఘడ్ జర్నలిస్టుల మీద చింతూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించి నాలుగు రాష్ట్రాల జర్నలిస్టులు నిరసనలు చేశారు. మీడియా ప్రతినిధుల మీద నకిలీ కేసులు పెట్టారని వారు ఆరోపించారు. దీనిమీద ప్రభుత్వం విచారణ జరపాలని జర్నలిస్టులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. చింతూరు టీఐ పాత్రపై కూడా దర్యాప్తు జరపాలని వారు కోరుతున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు నాయకులు కూడా అరెస్ట్‌ల మీద మళ్ళీ విచారణ జరిపి నివేదిక ఇచ్చేలా ఎస్పీని ఆదేశించాలని కోరారు.

ఈ డిమాండ్లను పరిగణలోకి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి అనిత.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జర్నలిస్టులపై చింతూరు పోలీసులు నమోదు చేసిన కేసును పునఃపరిశీలించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ నేతలు సమావేశమైన సందర్భంగా హోంమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. జరిగిన దానిపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఎస్పీ అల్లూరి సీతారామరాజును ఆదేశించారు. జర్నలిస్టులకు న్యాయం ,చేస్తామని హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు. మంత్రితో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, సంఘం రాష్ట్ర నాయకుడు కృష్ణమోహన్, సెక్రటేరియట్ జర్నలిస్టులు సత్యనారాయణ, రామకృష్ణ, ప్రసన్నకుమార్ విజయ్, సురేంద్రతోపాటు పలువురు పాల్గొన్నారు.

### అదిరిందయ్యా లోకేశా...

## మంగళగిరిలో నైపుణ్య గణన సర్వే !

- వచ్చే నెల 3న ప్రయోగాత్మకంగా మొదలు
- 25 రకాల సమాచారం సేకరణ..
- తుది దశకు చేరిన యాప్ రూపకల్పన



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** యువతలో నైపుణ్యాలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో స్కిల్ సెన్సెస్ కార్యక్రమానికి రాష్ట్ర విద్య ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టబోతున్నారు. నిర్దేశిత సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆన్లైన్ విధానంలో స్కిల్ సెన్సెస్ వివరాలు సేకరిస్తారు. భాగంగా వివరాలను సేకరించి వారిలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవడం ఉపాధి అవకాశాలు కల్పించడం తద్వారా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. దేశంలోనే మొదటిసారిగా నైపుణ్య గణనను సెప్టెంబరు 3న ప్రయోగాత్మకంగా మంగళగిరి నియోజకవర్గంలో నిర్వహించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కసరత్తు చేస్తోంది. దీంతో పాటు నాగార్జున విశ్వవిద్యాలయంలోనూ విద్యార్థుల నుంచి సమాచారం సేకరించనున్నారు.

సర్వేకు వినియోగించే యాప్ రూపకల్పన దాదాపుగా పూర్తయింది. సర్వేతో పాటు అభ్యర్థులు నేరుగా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. సర్వే పూర్తయిన తర్వాత వెబ్ సైట్ను అందుబాటులో ఉంచితే కొత్తగా

2 లో

## ఏపీలో పెట్టుబడులకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలు



- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తో బయో సింథటిక్ ఉడ్ కంపెనీ ప్రతినిధులు భేటీ
- రాష్ట్రంలో సింథటిక్ ఉడ్, హైడ్రో ఫోయిల్ బోట్లు తయారీ కంపెనీలు పెట్టేందుకు సుముఖత
- రూ. 300 కోట్లతో రెండు కంపెనీలు పెట్టేందుకు ముందుకొచ్చిన ఆరియా గ్లోబల్ కంపెనీ
- ముఖ్యమంత్రితో చర్చించి అన్ని విధాలా సహకరిస్తామని మంత్రి వెల్లడి

వివరాలు 2 లో

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో బయో సింథటిక్ ఉడ్ తయారీ యూనిట్ మరియు హైడ్రో ఫోయిల్ బోట్లు తయారు చేసే కంపెనీలు పెట్టేందుకు "ఆరియా గ్లోబల్" (సింగపూర్, స్పెయిన్ ) కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ను సచివాలయంలోని తన కార్యాలయంలో గురువారం కలిశారు. సహజసిద్ధమైన చెక్కకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారు చేసే బయో సింథటిక్ ఉడ్ ను తాము తయారు చేస్తున్నామని మంత్రికి వివరించారు. ఇది ప్రాక్టికల్ గా అనేక చోట్ల సక్సెస్ అయ్యిందని మంత్రికి తెలిపారు. ఈ బయో సింథటిక్ ఉడ్ వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని పేర్కొన్నారు.

అడవులను సంరక్షించేందుకు మరియు వివిధ రంగాల్లో ఈ బయోసింథటిక్ వినియోగం వల్ల నిర్వహణ ఖర్చు కూడా తగ్గించేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని వివరించారు. అదేవిధంగా అధునాతన టెక్నాలజీతో హైడ్రో ఫోయిల్ బోట్లు తాము

## ఏడాదిలో 7 లక్షల ఇళ్ళు

- రానున్న వంద రోజుల్లో 1.55 లక్షల ఇళ్ళు నిర్మించేందుకు చర్యలు...
- 2029 నాటికీ ఇళ్లులేని ప్రతి పేదవానికి పక్కాగృహం నిర్మిస్తాం.
- కాలనీలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం బాధ్యత రాహిత్యం కారణంగా సుమారు 4 వేల 500 కోట్ల రూపాయల నిధులు ఇతర అవసరాలకు వినియోగించడం జరిగిందన్నారు. పేదవాని

2 లో

## దమ్ముంటే... అనధికార లేఔట్ వేయండి




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌లో అనధికార లే అవుట్లపై మున్సిపల్ శాఖ ఫోకస్ పెట్టింది. అనుమతులు లేని లే అవుట్లపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. పురపాలక, నగర పాలక సంస్థల పరిధిలో అనధికారిక లే అవుట్ల వివరాలను ప్రజల ముందు ఉంచాలని మంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ మున్సిపాల్టీల్లోని లే అవుట్లలో 50 శాతం మేర అనధవికారిక లే అవుట్లు ఉన్నాయని మున్సిపల్ శాఖ ఇప్పటికే అంచనా వేసింది. దీంతో అనధికారిక లే అవుట్ల ముందు బోర్డులు పెట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. ఇప్పటికే వివిధ మున్సిపాల్టీల పరిధిలో అనుమతులు లేని లే అవుట్ల సమాచారాన్ని ప్రకటనల రూపంలో మున్సిపల్ శాఖ వెల్లడిస్తోంది. అనధికారిక లే అవుట్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. మున్సిపాల్టీల్లోని అనధికారిక లే అవుట్లతో పాటు వివిధ అర్బన్ అథారిటీల పరిధిలో వేసిన అనధికారిక లే అవుట్ల మీద మున్సిపల్ శాఖ ఫోకస్ పెట్టిందన్నారు. అర్బన్ అథారిటీల పరిధిలో 50 శాతానికి మించి అనధికారిక లే అవుట్లు ఉంటాయని మున్సిపల్ శాఖ ఇప్పటికే అంచనా వేసింది.

**యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు..**

రాష్ట్రవ్యాప్తంగా గత ఐదేళ్లలో యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు వెలిశాయి. ముఖ్యంగా కొందరు ప్రజాప్రతినిధుల అండతో వారి అనుచరులు ఈ అక్రమ లేవుట్లు వేసి విక్రయించేశారు. ప్రభుత్వంలో ఉండటంతో అధికారులు సైతం ఎలాంటి అభ్యంతరం పెట్టలేదు. ఎటువంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేశారనే ఆరోపణలు వచ్చినా ప్రభుత్వం, అధికారులు స్పందించలేదు. శ్రీకాకుళం జిల్లా నుంచి రాయలసీమ జిల్లాల వరకు ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు రియల్టర్లు నాలా కన్వర్షన్ లేకుండానే అనధికార లేఅవుట్లు వేసి విక్రయించినట్లు తెలుస్తోంది.

**కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత..**

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమ లే అవుట్లపై ఉక్కుపాదం మోపారు. అనుమతులు లేని లే అవుట్ల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అధికారులు అక్రమ లే అవుట్ల వివరాలు సేకరిస్తున్నారు. సామాన్య ప్రజలు అక్రమ లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలుచేసి మోసపోతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు మోసపోకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో భారీగా అక్రమ లే అవుట్లు వెలిసినట్లు తెలుస్తోంది. ఎన్నో ఫిర్యాదులు వచ్చినప్పటికీ అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

# ఏడాదిలో 7 లక్షల ఇళ్లు



(మొదటి పేజీ తరువాయి)

సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని ఈ ఏడాది ఏడు లక్షల ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళ్తుందని కాలనీలలో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి తెలిపారు.

ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాజుల పేట లేఅవుట్, ఈలప్రోలు వద్ద నిర్మిస్తున్న పక్కా గృహాలు లేఅవుట్, జి కొండూరు లేఅవుట్ మైలవరం మండలం పురాగుట్ట లేఅవుట్ లను గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధ సారథి స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్ జైన్ లతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ 2016 నుండి ఇప్పటివరకు పేదలకు 21 లక్షల గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. పేదవానికి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం ద్వారా పక్కా గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. గృహాలను నిర్మించుకోవడంలో లబ్ధిదారులుకు పూర్తి సహాయ సహకారాలు అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిన కారణంగా కేవలం 6.8 లక్షల ఇళ్ళను మాత్రమే నిర్మాణాలను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహ నిర్మాణాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాలనీల ద్వారా నిర్మిస్తున్న గృహాలను 2025 నాటికీ పూర్తి చేయాలన్నా సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. పేదలకు అవసరమైన సహాయ సహకారం అందించి నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు.

పట్టాణ ప్రాంతాలలో అమృత్ నిధులు, గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిహామీ జలజీవన్ మిషన్ నిధుల ద్వారా మౌలిక వసతులను కల్పించనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకతతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని ఇళ్లులేని అర్హులైన సుమారు 11 లక్షల మంది పేదలకు ఇళ్లను నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రసుత్తం పేదలకు మంజూరు చేసిన గృహాలను రానున్న మార్చి నాటికీ పూర్తి చేయకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు విడులయ్యే అవకాశం ఉండదని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతి కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించి గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. తాపీ మేస్త్రీలు మాటలకు లోనై అనవసరపు ఖర్చులను తగ్గించుకొని ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల మంజూరులో అర్హత లేనివారికి ఇళ్ల మంజూరు చేసినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై పూర్తి విచారణ చేసి అనర్హులుగా గుర్తిస్తే కేటాయింపులో రద్దు చేస్తామని మంత్రి తెలిపారు. ఇబ్రహీంపట్నం, ఈలప్రోలు కాలనీలలో ఇళ్ల నిర్మాణంలో బేస్మెంట్ ని నింపుకునేందుకు స్థానిక శాసనసభ్యులు సహకారంతో విటిపిఎస్ ఫ్లైయాష్ ను లబ్దిదారులకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలలో రోడ్ల పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి సిమెంట్ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా కృషి చేయనున్నట్లు మంత్రి కొలుసు పార్ధసారథి తెలిపారు.

మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష ప్రసాద్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం గాజులపేటలో 33 ఎకరాలలో 1406 గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈలప్రోలు సమీపంలో 12.97 ఎకరాలలో 709 గృహాలు జి కొండూరు సమీపంలో 12.42 ఎకరాలలో 360 గృహాలు మైలవరం సమీపంలోని పురాగుట్ట వద్ద 33.85 ఎకరాలలో 1147 గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. మంజూరైన గృహాలలో ఒక వంతు మాత్రమే పూర్తయ్యాయని మిగిలిన గృహాల నిర్మాణం చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కాలనీలలో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

కాలనీ గృహ నిర్మాణ పరిశీలనలో మంత్రి వెంట గృహ నిర్మాణ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్ జైన్, చీఫ్ ఇంజినీర్ జీవి ప్రసాద్, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ రజిని కుమారి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సిహెచ్ నాగరాజు, కొండపల్లి మున్సిపల్ కమీషనర్ రమ్య కీర్తన, ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, స్థానిక నాయకులు జంపాల సీతారామయ్య, రామినేని రాజా, చెన్నుబోయిన చిట్టిబాబు, సిహెచ్ శ్రీనివాసరావు, డి. విజయలక్ష్మి, అక్కల గాంధీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వదిలిపెట్టం..కమిటీ వేస్తున్నాం... దోషులను శిక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలకు కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించామన్నారు.

**భద్రత లోపాలు..**

కంపెనీలో భద్రతా లోపాలు స్పష్టంగా కనిపించాయని చంద్రబాబు తెలిపారు. గడిచిన 5 ఏళ్ల లో ఉమ్మడి విశాఖపట్టణం జిల్లాలో 119 ప్రమాదాలు జరిగాయని, 120 మంది మృతి చెందారన్నారు. నాలుగేళ్ల క్రితం ఎల్‌జి పాలిమర్స్ ఘటన లో విషవాయువులు లీకయ్యాయన్నారు. అంత తీవ్రత ఉన్న విషవాయువు కానప్పటికీ ప్రమాదకర రసాయనాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎల్‌జి పాలిమర్స్ ఘటనలో హైపవర్ కమిటీ వేసినా.. పటిష్ట చర్యలు తీసుకోలేదన్నారు.

**హై పవర్ కమిటీ**

అచ్యుతాపురం ఎసెన్సియా ఫార్మా కంపెనీ ఘటనపై హై పవర్ కమిటీ వేస్తున్నామని చంద్రబాబు నాయుడు తెలిపారు. పరిశ్రమలతో పాటు ప్రజల భద్రత ముఖ్యమన్నారు. రెడ్ కేటగిరి పరిశ్రమలు తప్పకుండా సేఫ్టీ అడిట్ జరిపించాలని సీఎం హెచ్చరించారు. పరిశ్రమల



నిర్వహణపై ఒక ఎంక్వైరీ కమిటీని వేస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా పరిశ్రమలను లూటీ చేశారని.. ఆ కారణంగానే ప్రమాదాలు ఎక్కువయ్యాయన్నారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తప్పవన్నారు. బాధ్యులైన అందరిపైనా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అధికారుల అలసత్వంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కంపెనీ యాజమాన్యం ఇప్పటివరకు అందుబాటులో లేకుండా పోయిందని చెప్పారు. పరిశ్రమలు రావాలి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని.. అంతకంటే ముందు భద్రత చాలా ముఖ్యమన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మూకుమ్మడిగా కంపెనీల్లో తనిఖీలు చేయాలన్నారు. పరిశ్రమల్లో తనిఖీల తర్వాత నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

**అధైర్య పడొద్దు... అండగా ఉంటాం...**

అచ్యుతాపురం ఫార్మా ప్రమాద బాధితులను మెడికవర్ ఆస్పత్రిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ప్రమాద వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అన్నివిధాలా చూసుకుంటుందని బాధితులకు సీఎం భరోసా ఇచ్చారు.

ఎంత ఖర్చు అయినా రక్షించుకుంటామని హామీ ఇచ్చారు. తాము అండగా ఉంటామని.. ధైర్యంగా ఉండాలని బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధైర్యం చెప్పారు. అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తామని అన్నారు. బాధితుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అయితే, మెడికవర్ ఆస్పత్రి దగ్గర సీఎం చంద్రబాబు భావోద్వేగం అయ్యారు.

ఫార్మా కంపెనీలో జరిగిన ఘటన తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 17 మంది మృతి, 36 మందికి గాయాలయ్యాయని అధికారులు చంద్రబాబుకు వివరించారు. 10 మందికి తీవ్రగాయాలు, 26 మందికి స్వల్పగాయాలు అయ్యాయని తెలిపారు.

బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫార్మా ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ప్రకటించారు. తీవ్ర గాయాలైనవారికి రూ.50 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. స్వల్ప గాయాలైన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

# రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సభలు

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజలంతా కలిసి తీర్మానాలు చేయనున్నారని తెలియజేశారు.

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా రూ.4,500 కోట్ల నిధులతో, 87 రకాల పనులను గ్రామాల్లో చేయనున్నామన్నారు. దీని ద్వారా మొత్తం 9 కోట్ల పనిదినాలు, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించే బృహత్తర ప్రణాళిక అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన దేశంలో ఎన్నడూ లేనట్లుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చేయాల్సిన పనులపై చర్చించేందుకు మొత్తం 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహిస్తున్న నేపథ్యంలో పవన్ కళ్యాణ్ గురువారం మంగళగిరిలోని ఆయన ప్రైవేట్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "దేశంలోనే పంచాయతీ వ్యవస్థను మొదలు పెట్టిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి మూడు దశాబ్దాలు దాటింది. రెండో తరం సంస్కరణలతో పంచాయతీల నలుదిశల విప్లవం మన రాష్ట్రం నుంచే ఇప్పుడు మొదలుపెడుతున్నాం. గత మూడు దశాబ్దాలుగా పంచాయతీలకు జాతీయ పండుగల నిర్వహణకు మైనర్ పంచాయతీలకు రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 ఇస్తూ వచ్చారు. ఇప్పుడు మనం తీసుకొస్తున్న పంచాయతీ సంస్కరణల్లో భాగంగా మైనర్ పంచాయతీలకు రూ.10 వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు నిధులను పెంచి పంచాయతీలకు అండగా ఉంటామని భరోసాను ఇచ్చాం అన్నారు.

**మన గ్రామాన్ని మనమే పరిపాలించుకుందాం**

పంచాయతీ సంస్కరణలు కొనసాగింపులో భాగంగా ఈ నెల 23వ తేదీన గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. గ్రామసభ అంటే ఏదో తూతూ మంత్రంగా చేయడం కాకుండా పంచాయతీలోని వారంతా కలిసి కూర్చొని గ్రామాభివృద్ధి మీద నిర్ణయాలు తీసుకునేలా నిర్వహిస్తాం. మన గ్రామాలను మనమే పరిపాలించుకుందాం అనేలా వీటి నిర్వహణ ఉంటుంది.

భారతదేశపు మూలాలు, జీవం పల్లెల్లోనే ఉంటుందని మహాత్మా గాంధీ చెప్పారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు సంకల్పంతో, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో రాష్ట్ర పంచాయతీలను స్వయంశక్తి పంచాయతీలుగా సాకారం చేసుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. పంచాయతీలకు ఉండే అధికారాలను గ్రామాల అభివృద్ధికి ఉపయేపడేలా చేసి... పూర్తి స్థాయిలో గ్రామాల ముఖ చిత్రం మార్చుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

**గత ప్రభుత్వంలో పంచాయతీలు నిర్వీర్యం**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ప్రభుత్వంలో 2019-2023 సంవత్సరం వరకు రూ.40,579 కోట్లు నిధులు వచ్చాయి. ఈ పనుల పూర్తిస్థాయి ఫలితాలు మాత్రం క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. గ్రామీణాభివృద్ధి కోసం ఈ నిధులను సక్రమంగా వాడి ఉంటే దాని ఫలాలు కనిపించేవి. కానీ గత ప్రభుత్వంలో ఈ నిధులను ఇష్టానుసారం ఖర్చు చేశారు. కరోనా సమయంలో ఈ నిధులను ఇష్టానికి వాడుకున్నారు. దీంతో పాటు గత ప్రభుత్వంలో పంచాయతీల ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయింది. 2014-19 వరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల ఆదాయం రూ.240 కోట్లు ఉంటే, 2019-23 సంవత్సరాల్లో ఆ ఆదాయం గణనీయంగా తగ్గి కేవలం రూ.170 కోట్లే వచ్చింది. క్షేత్రస్థాయిలో పంచాయతీల ఆదాయం తగ్గిపోవడానికి గత ప్రభుత్వ విధానాలే కారణం. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు సర్వ స్వతంత్రత తీసుకురావాలనే సంకల్పంతో పని చేస్తోంది. పంచాయతీలు వాటి కాళ్ల మీద అవే నిలబడి స్వయం సమృద్ధి సాధించేలా తయారు చేయాలనే పట్టుదలతో ఉన్నాం. పంచాయతీలకు సంబంధించిన విద్యుత్తును అవే ఉత్పత్తి చేసుకునేలా, వాటి ఆదాయం అవే సంపాదించుకునేలా తయారు చేస్తాం. రాష్ట్రాభివృద్ధిలోనే కాకుండా దేశాభివృద్ధిలోనూ రాష్ట్ర పంచాయతీలు కీలకంగా వ్యవహరించేలా తయారు చేస్తాం.

**పంచాయతీల ప్రత్యేకతను గుర్తించి ఆదాయం సృష్టిస్తాం**

రాష్ట్రంలోని గొప్పదనం ఏమిటంటే ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. కళలు, ఆహార పదార్థాల తయారీ, వస్త్రాల తయారీ, ఇతర కళాకృతుల తయారీ వంటి వాటికి మన గ్రామాలు ప్రత్యేకం. విశాఖపట్నం జిల్లాలో ఆనందపురంలో పూలు ప్రసిద్ధి. అరకులో అరకు కాఫీకు ప్రత్యేకత ఉంది. మంగళగిరి చీరలు, సత్యసాయి జిల్లాలో లేపాక్షి, బాపట్లలో వేటపాలెం గ్రామం, కృష్ణాజిల్లాలో చిలకలపూడి, కొండపల్లి హస్త కళలకి ప్రసిద్ధి. ఇలాంటివి అన్ని జిల్లాల్లో ఉన్నాయి. వాటి ప్రత్యేకతలను గ్రామ సభల్లో గుర్తించి, నిర్ణయించి వాటిని ప్రమోట్ చేయాలని భావిస్తున్నాం. తయారు చేసే విశిష్టమైన వస్తువులు, ఆహార పదార్థాలను ఎగుమతులు చేసి సంపద సృష్టించే మార్గాలను అన్వేషిస్తాం. గ్రామసభలకు యువత, మహిళలు విరివిగా పాల్గొవాలి. పంచాయతీల్లో మహిళలు ఎక్కువగా పాల్గొవాలని కోరుకుంటున్నాను.

**పంచాయతీల ఆదాయం పెంచేలా సామాజిక అడవుల పెంపకం**

పంచాయతీల్లో చాలా భూమి నిరు పయోగంగా ఉంటోంది. దాన్ని క్రమ పద్ధతిలో వినియోగించుకోవాలి. స్వచ్ఛ భారత్ ను మరో మెట్టు ఎక్కించేలా గ్రామ పంచాయతీల్లో ఓ ప్రణాళిక ప్రకారం ఎక్కడా చెత్త లేకుండా క్లీన్, గ్రీన్ గ్రామాలుగా తయారు చేసేలా దృష్టిపెడుతున్నాం. డెన్మార్క్ అనే చిన్నదేశం నుంచి కలపను మన దేశం అధికంగా దిగుమతి చేసుకుంటోంది. రూ.6 వేల కోట్ల విలువైన కలపను ఏటా దిగుమతి చేసుకుంటున్నాం. ఇంత మొత్తం విదేశీ మారక ద్రవ్యం కేవలం కలప కోసం ఇంత వెచ్చిస్తున్నాం. గ్రామ పంచాయతీలకు సంబంధించి వృథాగా ఉన్న స్థలంలో సామాజిక అడవి విభాగంలో కలపను పెంచాలని భావిస్తున్నాం. దీని ద్వారా పంచాయతీల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. నరేగా పనులను అటవీ శాఖకు అనసంధానం ఉంది. మూగ జీవాలకు నీటి వసతి కల్పించేలా గుంతలను తవ్వడం వంటి వాటికి ఉపయోగిస్తాం. గ్రామాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేసే ఆలోచన చేస్తున్నాం. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లి అక్కడున్న ప్రత్యేకతలను తిలకించేలా పర్యాటకులను ప్రోత్సహిస్తాం.

**గత ప్రభుత్వంలో సోషల్ ఆడిట్ బలహీనం చేశారు**

గత ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్ పనులు, ఉపాధి పనుల్లో చాలా అవకతవకలు జరిగాయి. జల్ జీవన్ మిషన్ పథకం పనులకు పైపు లైన్లు వేసి వదిలేశారు. వాటికి కనెక్షన్ ఇవ్వలేదు. మరోపక్క పైపులైన్ల కోసం తవ్విన పనులు ఉపాధి హామీ పథకంలో చేశారు. అసలు ఏ పనులు దేనికి చేశారో గ్రామ సర్పంచులకు తెలియదు. మస్తర్ బుక్ లో సంతకాలు పెట్టించుకోవడం తప్పితే, సర్పంచులకు ఏ పనులు ఎక్కడ చేశారన్న వివరాలు చెప్పలేదు. దీనిలో బోలెడు అవకతవకలు జరిగాయి. నిధుల దుర్వినియోగం దారుణంగా జరిగింది. గత ప్రభుత్వ హయాంలో పనులను పర్యవేక్షించాల్సిన, నిధుల దుర్వినియోగం అరికట్టాల్సిన సామాజిక తనిఖీ విభాగం సక్రమంగా పని చేయలేదు. సామాజిక తనిఖీ విభాగానికి కూడా పోలీస్ అధికారిని హెడ్ గా పెట్టాలని ఆలోచిస్తున్నాం. దీనిపై అన్ని విధాలా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వంలో సోషల్ ఆడిట్ విభాగం బాధ్యుడిని తప్పించాము. రకరకాల అభియోగాలు వచ్చిన అధికారులను పక్కన పెట్టాం. నిఘా విభాగంపై నిఘా పెట్టాల్సి వచ్చింది. పంచాయతీల్లో సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులు ఉండాలి. దాన్ని ప్రతి పంచాయతీల్లో అందరికీ కనిపించేలా ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వంలో పెండింగ్ లో ఉండిపోయిన రూ.2 వేల కోట్ల నిధులను కూటమి ప్రభుత్వంలో విడుదల చేశాం. మెటీరియల్ కంపోనెంట్ గ్రాంట్ ను త్వరలోనే ఇస్తాం.

**నీటి పునర్వినియోగంపై దృష్టి**

నీటి కోసం గ్రామాల్లో బోర్లు హద్దులు దాటి వేస్తున్నారు. దీనివల్ల ఫ్లోరైడ్ ఎక్కువగా పడుతోంది. భూమి పొరలను దాటి నీటి కోసం లోతులకు వెళ్తున్న కొద్దీ ఫ్లోరైడ్ వస్తోంది. నీటిని పునర్వినియోగంపై దృష్టి సారించాలి. అప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయి. తక్కువ దూరంలోనే నీళ్లు లభిస్తాయి. ప్రస్తుతం గ్రామాల్లో పల్స్ సర్వే చేస్తున్నాం. పంచాయతీల్లో నీటి పరిస్థితిపై 16 అంశాలతో సర్వే నిర్వహిస్తున్నాం. 22 లక్షల ఇళ్లలో సర్వే పూర్తి అయింది. ఇది రాష్ట్రం మొత్తం మీద పూర్తయితే అన్ని పంచాయతీల్లో ఉన్న వాటర్ సోర్సు మీద ఓ స్పష్టత వస్తుంది. అప్పుడు ఓ ప్రణాళిక ప్రకారం నీటి సమస్యను తీర్చేందుకు ముందుకు వెళ్తాం.

**విశాఖలో పరిశ్రమల కాలుష్యం మీద నిఘా పెడతాం**

అచ్యుతాపురం ఎసెన్షియా సంస్థలో జరిగిన ప్రమాదం దురదృష్టకరం. వరుసగా పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎసెన్షియా ఫాక్టరీలో రక్షణ చర్యలు చేపట్టడంలో ఆ పరిశ్రమలకు చెందిన ఇద్దరు యజమానుల మధ్య ఉన్న వ్యక్తిగత గొడవలు కూడా ఓ కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ఫాక్టరీల్లో సేఫ్టీ ఆడిట్ చేయడం మీద దృష్టి పెడతాం. సేఫ్టీ ఆడిట్ అంటే పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి ఉంది. అందుకే పారిశ్రామికవేత్తలతో ఒకసారి కూర్చొని మాట్లాడదామని, తీసుకుంటున్న రక్షణ చర్యలు వివరించాలని కోరుతాను. ఇప్పటికే హిందూస్తాన్ షిపింగ్ యార్డు వారితో ఒకసారి మాట్లాడాను. మీరు తీసుకుంటున్న రక్షణ చర్యలు చెప్పాలని కోరితే, వారు బాగానే తీసుకుంటున్నాం అని చెబుతున్నారు కానీ పూర్తి భద్రత ఇవ్వాలనేది ప్రాథమిక బాధ్యత. సేఫ్టీ ఆడిట్ ను కఠినంగా అమలు చేస్తే పారిశ్రామికవేత్తలు భయపడతారని, వారు ముందుకు రారని చెబుతున్నారు. అయితే పరిశ్రమలు కచ్చితంగా అక్కడి పనిచేసే వారికి కనీస రక్షణ పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమల్లో రక్షణ అంశం మీద నేనే ప్రత్యేకంగా దృష్టి పెడతాను. ఈ నెల చివర్లో విశాఖపట్నంలో ప్రత్యేకంగా దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తాను. ముఖ్యంగా విశాఖపట్నంలో రోజురోజుకీ కాలుష్యం పెరుగుతోంది. దీన్ని అరికట్టడంపై దృష్టి పెడతాం. పరిశ్రమల కాలుష్యం మీద నిరంతర నిఘా ఉండేలా, ప్రమాదాలను పూర్తిగా అరికట్టేలా శాశ్వత పరిష్కారం చూడాలి" అన్నారు.

# సిగ్గుపడాలి



(మొదటి పేజీ తరువాయి)

చేయాలంటే కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. అయితే కనీసం అగ్నిమాపక సామాగ్రి కూడా అందుబాటులో లేని పరిశ్రమలు, అందుబాటులో లేని పరిశ్రమలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి.

అభివృద్ధి అవసరమే అయితే అది ప్రాణం తీసేలా ఉండకూడదు కదా.. ఇప్పుడు అదే జరుగుతోంది. పాలిమర్ గ్యాస్ లీకేజీ ఘటన మరువకముందే ఇప్పుడు రాంబిల్లి మండలం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు.. అసలు పరిశ్రమల్లో ఏం జరుగుతుందో అధికారులకు తెలుసా అనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలు పరిశ్రమలను తనిఖీ చేసేందుకు అధికారులు వెళ్తున్నారా లేదా.. ప్రమాదం జరిగినప్పుడు ప్రకటనలు చేస్తున్న ప్రజాప్రతినిధులు సైతం వీటిని పట్టించుకోవడం లేదు. ఫలితం అన్యం పుణ్యం తెలియని కార్మికులు బలి. కష్టపడదాం కొంత జీతం వస్తుంది, కుటుంబాన్ని పోషించుకుందాం అనే ఆలోచనతో కార్మికులు పరిశ్రమలకు వెళ్తున్నారు. అక్కడ భద్రత ఉందా లేదా అనేది వాళ్ళకి అప్రస్తుతం. భద్రత చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అధికారులదే కదా.

ఇప్పుడు ఫార్మాసిటీలో జరిగిన ప్రమాదానికి బాధ్యులు ఎవరు.. ఎందుకు రియాక్టర్ పేలింది.. అనే విషయాలను ఇంకా అధికారులు వెల్లడించాల్సి ఉంది. మొత్తం మీద కార్మికుల జీవితాలపై ఈ రియాక్టర్ పేలుడు ఘటన తీవ్ర ప్రభావం చూపింది. ఫార్మాసిటీ కంపెనీని అధికారులు సేఫ్టీ ఆడిట్ చేశారా లేదా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ఏదైనా ఈ పాపంలో అందరూ పాలుపంచుకున్నట్లే మారింది. ఫలితం మాత్రం కార్మికుల జీవితాలు మసకబారాయి. ఎంత ఆర్థిక సాయం చేసినా మరణించిన వారు రారు.. వారు లేని లోటు తీర్చలేరు. చివరకు ఇలాంటి సంఘటనలన్నీ కార్మికుల జీవితాలకు పరిపాటిగా మారాయి. ఇప్పటికైనా పరిశ్రమల శాఖ ఇలాంటి కంపెనీలపై ఏ విధంగా చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

**ఇదే కోవలో కైలాస పట్నం ఘటన..**

రెండు రోజుల క్రితం ఫుడ్ పాయిజన్ కావడంతో అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఇబ్బడి ముబ్బడిగా వసతి గృహాలను ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్న విషయం అధికారులకు తెలియదా. తెలిసినా పట్టించుకోలేదా.. ఫలితం ముగ్గురు చిన్నారుల ప్రాణాలు బలి. వెంటనే మళ్ళీ పాతపాటే. వస్తే గృహాలు ఏర్పాటు చేయాలంటే అనుమతులు కావాలి.. లేదంటే చర్యలు తీసుకుంటాం.. అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు ఈ రెండు మాటలు చెప్పడం అలవాటుగా మారింది.

# ఏపీలో పెట్టుబడులకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలు

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేస్తున్నామని మంత్రికి తెలిపారు. ఈ బోట్లను ఇండియన్ నేవీకి త్వరలో సప్లయ్ చేయడానికి ఇప్పటికే చర్చలు సక్సెస్ ఫుల్ గా పూర్తయ్యాయని, సప్లయ్ చేసే అంశంపై తుది నిర్ణయం నేవీ ఉన్నతాధికారుల వద్ద పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. ఈ బోట్లు తయారు చేసే కంపెనీని ఏపీలో నెలకొల్పి, ఇక్కడి నుండే బోట్లు తయారు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ బోట్లు సాధారణ బోట్ల కంటే వేగంగా, సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇవి కోస్టల్ పెట్రోలింగ్ కు చాలా ఉపయోగకరమని వివరించారు. అందుకే ఇండియన్ నేవీ వీటిని తీసుకోవాలని చూస్తోందని తెలిపారు. ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తే రాష్ట్రంలో బయోసింథటిక్ ఉడ్ తయారీ మరియు బోట్ల తయారీ కంపెనీలను రూ.300కోట్ల పెట్టుబడితో పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి జనార్ధన్ రెడ్డికి సంపత్ కుమార్ పలు వివరాలు సమర్పించారు. దీనిపై మంత్రి జనార్ధన్ రెడ్డి స్పందిస్తూ... ఈ విషయాలను ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కంపెనీలు పెట్టేందుకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.

# అదిరిందయ్యా లోకేశా...మంగళగిరిలో నైపుణ్య గణన సర్వే !

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్లోకి వచ్చే వారు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు యోచిస్తున్నారు.

**ఎవరు చేస్తారు?**

ఒక్కో గ్రామ, వార్డు సచివాలయం నుంచి ఆరుగురు చొప్పున ఉద్యోగులను ఈ సర్వేకు వినియోగించను న్నారు. వీరికి ఈ నెల 23, 24, 30, 31న రెండు విడ తలుగా శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం వీరు ఇంటింటికీ వెళ్లి ట్యాబ్లో సమాచారం సేకరిస్తారు.

**నైపుణ్య గణన సర్వే లో... ఏమేం వివరాలు సేకరిస్తారు?**

అక్షరాస్యులు? నిరక్షరాస్యులు? ఉద్యోగులు! చదువుకుని ఉద్యోగం రాని వారు? ఉద్యోగం సంఘటిత రంగమా? అసంఘటిత రంగమా? నిరుద్యోగుల విద్యార్హతలు! పీహెచ్, ఎంఎస్, డిగ్రీ, ఇంటర్మీడి యట్, పదో తరగతి, ఎనిమిదో తరగతి బీటెక్ చదివితే డొమైన్ నాలెడ్జ్ ఉందా? ఇలా 25 రకాల ప్రశ్నల ద్వారా సమాచారం సేకరి స్తారు. సంఘటిత రంగంలో ఉద్యో గాలు చేస్తున్న వారి పీఎఫ్ ఖాతాలు, అసంఘటిత రంగంలో ఉంటే ఈ-శ్రమ్ ద్వారా వివరాలు తీసుకోనున్నారు.

**ఎంత సమయం పడుతుంది?**

మంగళగిరిలో ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే ద్వారా సమాచారం సేకరించి, విశ్లేషణ చేసేందుకు దాదాపు 8. నెలల సమయం పడుతుందని నైపుణ్యాభివృద్ధి సంస్థ అంచనా వేసింది.

**లాభమేంటి?**

ఈ సర్వే పూర్తయిన తర్వాత ఎంతమంది. నిరుద్యోగులు ఉన్నారు? ఎంతమంది ఉద్యోగం చేస్తున్నారు? ఉద్యోగం చేస్తున్న వారిలో ఎంత మంది ఇంకా మంచి ఉద్యోగం కోరుకుంటు న్నారు? నిరక్షరాస్యులు ఎంతమంది? వారికి అవసరమయ్యే శిక్షణ.. ఇలా సమస్త సమాచారం అందుబాటులోకి రానుంది. ఈ సమాచారం దాదాపు 20 ఏళ్లపాటు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ఉపయోగపడుతుందని అధికారుల అంచనా.

**సర్వే తర్వాత ఏం చేస్తారు?**

ఎవరికి ఏ డొమైన్లో నైపుణ్య శిక్షణ అవ సరమో గుర్తించిన అనంతరం నైపుణ్య కళాశా లలు, హబ్లు, కొత్తగా కళాశాలలు, వర్సిటీ ల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ తర్వాత అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇస్తారు. ఎలాంటి నైపుణ్యాలు కావాలో కంపెనీల నుంచి సైతం వివరాలు తీసుకుంటారు. వాటికి. అనుగుణంగా శిక్షణ ఇచ్చి, ఆయా కంపెనీలకు అనుసంధానం చేస్తారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, కేంద్ర ప్రభుత్వ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్స్ సేవలను సైతం శిక్షణలో వినియోగించుకోనున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

## ఫార్మా కంపెనీలో పేలుడు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి పరిహారం

**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** అనకాపల్లి సెజ్‌లోని ఎసెన్సియా అడ్వాన్సుడ్ సైన్సెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి పరిహారం ప్రకటించారు. విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఒక్కో కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలని నిర్ణయించినట్లు కలెక్టర్ ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇవాళ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, క్షతగాత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరామర్శించనున్నారు. ప్రమాద ఘటనపై కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. ఇవాళ ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో కార్మిక సంఘాల నేతలతో కలెక్టర్ చర్చలు జరిపారు. మృతులకు భారీ పరిహారం ఇవ్వడంతోపాటు, గాయపడిన వారి చికిత్సకు మొత్తం ఖర్చు భరిస్తామని భరోసా ఇచ్చారు. అనకాపల్లి ఫార్మా సెజ్‌లో తరచూ ప్రమాదాలు జరగడంపై కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ట్రాఫిక్ పోలీసులపై ఏపీ హైకోర్టు అసహనం




**(జర్నలిస్ట్ ఫైల్) :** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలనే నిబంధనను అమలు చేయడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలమయ్యారని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. మోటారు వాహన చట్టం నిబంధనలు పాటించేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాది యోగేష్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎలక్ట్రానిక్ విజిలెన్స్ ఉండాలని ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన ధర్మాసనం, కీలక వ్యాఖ్యలు చేసింది. 99 శాతం మంది హెల్మెట్ ధరించకుండానే ద్విచక్ర వాహనాలు నడుపుతున్న విషయాన్ని తాము గమనించామని ధర్మాసనం తెలిపింది. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని గతంలో హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు అమలు చేయాల్సిందేనని మరోసారి స్పష్టం చేసింది. తాము ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత ఎంత మంది ప్రమాదాల్లో మరణించారు? ఇప్పటి వరకూ ఎన్ని చలనాలు విధించారు? తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలను ధర్మాసనం ఆదేశించింది. అనంతరం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## రైలు ఇంజన్ లో మనిషి తల బాడీ కోసం వెతుకుతోన్న రైల్వే పోలీసులు

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖలో దారుణం వెలుగు చూసింది. రాయపూర్ నుంచి విశాఖ చేరుకున్న రైలు ఇంజన్లో గుర్తు తెలియని వ్యక్తి తల బయటపడింది. లోకోపైలెట్ ఇంజన్ పరిశీలిస్తుండగా మనిషి తల కనిపించింది. వెంటనే రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తలను స్వాధీనం చేసుకుని కేజీహెచ్‌కు తరలించారు. తల చెదిరిపోయి ఉండటంతో గుర్తుపట్టలేని విధంగా తయారైంది. రైలు ప్రయాణం చేసిన మార్గంలో రైల్వే పోలీసులు వెతుకుతున్నారు. దాదాపు 150 కి. మీ పరిధిలో ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. రైలు పట్టాల వెంట పరిశీలిస్తున్నారు. ఎవరైనా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చనే కోణంలోనూ రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

## తిహార్ జైల్లో ఎమ్మెల్సీ కవితకు అనారోగ్యం : ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలింపు



**(జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీ లిక్కర్ స్కాంలో తిహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీవ్ర అనారోగ్యం పాలైంది. వైరల్ జ్వరం, గైనిక్ సమస్యలతో ఆమె బాధపడుతోంది. తీవ్ర జ్వరం రావడంతో కవితను జైలు అధికారులు ఎయిమ్స్ కు తరలించి వైద్యం అందిస్తున్నారు. కవిత అనారోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎయిమ్స్ వైద్యులు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో అనారోగ్య సమస్యలు తొలగి పోతాయన్నారు. కవిత బెయిల్ పిటిషన్‌ను ఇప్పటికే ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. మధ్యంతర బెయిల్ కోసం కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## పేదల ఉన్నతికి అందరూ పాటుపడాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పేదల ఉన్నతికి ప్రతి ఒక్కరూ లైఫ్ టైం చారిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు సాతులూరి ప్రకాష్ రావు అన్నారు. ఏటుకూరు రోడ్డు లోని కన్యక పరమేశ్వరి కాంప్లెక్స్ లో లైఫ్ లైఫ్ చారిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108 మంది పేదలకు నిత్యవసర సరుకులు, బియ్యంతో పాటు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రకాష్ రావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెల పేదలకు బియ్యం నిత్యవసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ఈ తరహా సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని మట్టుపల్లి శ్రీనివాస చరణ్ అన్నారు. కార్యక్రమంలో బి లక్ష్మి కోటి గణేష్, జి శ్యాంసుందర్, ఏ వెంకట రమణారావు, కే మదన్, పత్తి వెంకటనారాయణ, నేరెళ్ల శ్రీనివాసరావు, సీహెచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ఆదేశాలతో సమ్మె విరమించిన ఎయిమ్స్ వైద్యులు

**న్యూఢిల్లీ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమ్మెను విరమిస్తున్నట్లు ఎయిమ్స్ వైద్యులు గురువారం ప్రకటించారు. కోల్‌కతా వైద్యురాలి అత్యాచార, హత్య ఘటనకు నిరసనగా గత 11 రోజులుగా ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే.

సుప్రీంకోర్టు అభ్యర్థన మేరకు తిరిగి విధుల్లో చేరుతున్నామని ఎయిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే ఆర్‌జి కార్ ఆస్పత్రి ఘటనలో జోక్యం చేసుకుంటామని, వైద్యుల భద్రతకు సుప్రీంకోర్టు హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కోర్టు చర్యలను అభినందిస్తున్నామని, ఆదేశాలను పాటిస్తామని అన్నారు. రోగులకు చికిత్సనందించడమే తమ మొదటి ప్రాధాన్యతని అన్నారు.

విద్యార్థులు చేపడుతున్న నిరసనలు ప్రజారోగ్య సంరక్షణపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వైద్యులు తిరిగి విధుల్లోకి చేరాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ ఆదేశించారు. శాంతియుత ఆందోళనలపై నిర్బంధ చర్యలు చేపట్టకూడదని ప్రభుత్వాలను ఆదేశించింది.

## అచ్యుతాపురం సెజ్ ప్రమాద బాధితులకు సీఎం పరామర్శ



**(జర్నలిస్ట్ ఫైల్) :** అచ్యుతాపురం సెజ్ ప్రమాద బాధితులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించారు. విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైద్యులను అడిగి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడిన ప్రతీ ఒక్కరూ కోలుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 లక్షల పరిహారం అందజేస్తామన్నారు. స్వల్ప గాయాలైన వారికి రూ. 25లక్షల చొప్పున సాయం అందిస్తామని చెప్పారు. ఎంత ఖర్చు అయినా బాధితులందరికీ ఉత్తమ వైద్య సేవలందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. గత ఐదేళ్ళలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని దాని పర్యవసానమే ఈ ప్రమాదం అని సీఎం తెలిపారు. ప్రమాద ఘటన సమాచారం అందిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున సాయం అందజేయనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ సంతాపాన్ని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో భారీ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికి పైగా గాయపడ్డారు.

## వేల పాత ఫోన్లు సీజ్ : బిహార్ ముఠా అరెస్ట్




**(జర్నలిస్ట్ ఫైల్):** పాత ఫోన్లు కొంటాం అంటూ.. మీ వీధిలో ఎవరైనా కేకలు వేయగానే ఎగిరి గంతేసి, ఫోన్ అమ్మేశారా. ఇక అంతే సంగతి. భవిష్యత్తులో ఆ ఫోన్ సాయంతో దొంగల ముఠాలు చేసే అరాచకాలు మీకు చుట్టుకునే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల పాత ఫోన్లు కొంటామంటూ కొన్ని ముఠాలు వీధి వీధికి తిరుగుతున్నాయి. కొన్ని ఫోన్లకు డబ్బు, మరికొన్ని పాత మోడళ్లకు ప్లాస్టిక్ వస్తువులు ఇస్తూ వేలాది ఫోన్లు సేకరించిన బిహార్ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4 వేల ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బిహార్, జార?ండ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కొన్ని సైబర్ ముఠాలు పాత ఫోన్లు సేకరించి వాటికి మరమ్మతు చేసి, నేపాల్ నుంచి తెచ్చిన దొంగ సిమ్‌లతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దొంగతనాల విచారణ సమయంలో సీడీఎంఏ నెంబరు పరిశీలిస్తే అమాయకుల పేరుతో ఉంటున్నాయని పోలీసులు తెలిపారు. అందుకే పాత ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో ఎవరికీ అమ్మవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ పాతఫోన్లను అమ్మితే అందులో ఉండిపోయిన మీ డేటా కూడా దొంగల భారినపడే ప్రమాదముందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రతి ఇంట్లో నాలుగైదు పని చేయని ఫోన్లు కనిపిస్తూనే ఉంటాయి. అడ్డుగా ఉన్నాయి కదా అని అడ్డు తొలగించుకుంటే, భవిష్యత్తులో ఎలాంటి కొత్త సమస్యలు వస్తాయో చెప్పలేం. అందుకే పాత ఫోన్లు అమ్మేయడంలాంటి పనులు చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రోడ్డు ఆక్రమణలపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు



**నెల్లూరు కలెక్టరేట్ (జర్నలిస్ట్ ఫైల్) :** పాదచారులు, వాహన చోదకులకు అడ్డంకిగా మారి ట్రాఫిక్ అంతరాయాలకు కారణమవుతోన్న రోడ్డు ఆక్రమణలపై జరిమానాలతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా పాత మున్సిపల్ కార్యాలయం నుంచి సిరి మల్టీప్లెక్స్, అర్చన సినిమా హాలు మార్గంలో ఏసీ కూడలి వం-కు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ కూడళ్లలోని ఐల్యాండ్‌లు, డివైడర్లను పరిశీలించిన కమిషనర్, వాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి పచ్చదనం పెంచాలని సూచించారు. నగర వ్యాప్తంగా ఫుట్ పాత్‌లను పరిశీలించి ఆక్రమణలపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామగ్రి ఆక్రమణలను తొలగించేలా యజమానులకు నోటీసుల ద్వారా తెలియజేయాలని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని కమిషనర్ ఆదేశించారు. ఆయన వెంట ఇంజనీరింగ్ ఎస్ఈ సంపత్ కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ దేవి కుమారి, టి.పి.ఓ. ప్రకాష్, డి.ఈ.ఈ. అనిల్, రెవెన్యూ అధికారి సమద్, ఇంజనీరింగ్ , ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.

## విద్యార్థినుల సమస్యలు సత్వర పరిష్కారం విసి ప్రొఫెసర్ గంగాధర రావు




**(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్ కత్తా నగరంలో ఆర్ జి కార్ ఆసుపత్రిలో ట్రైనీవైద్యురాలపై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీజీ డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల ఫ్యాకల్టీ మెంబర్స్, విద్యార్థిని విద్యార్థులు ర్యాలీగా పాల్గొని వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే. గంగాధర రావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినిలు విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కోసం ముఖ్యంగా వారి రక్షణ కోసం ఒక ప్రత్యేక అధికారిని నియమించి ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు . అందుకు ఆయన స్పందించి అలాంటి చర్యలు తీసుకోవాల్సిందిగా విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. జయశ్రీ ని పరిశీలించమని కోరారు. విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద నుంచి ప్రారంభమైన న్యాయవిభాగపు విద్యార్థుల ర్యాలీ అన్ని విభాగాలు మీదుగా వర్సిటీ ప్రధాన గేటు లోని ఆచార్యనాగార్జున విగ్రహం వద్ద కొద్దిసేపు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎల్ఎం క్రైమ్ బ్రాంచ్ విద్యార్థిని తన్మై విద్యార్థినిల సమస్యల పరిష్కారం కోసం సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ (ఎస్ పి ఓ సి), తో పాటుగా మహిళా ఫిర్యాదు విభాగం ఉమన్ గ్రీవెన్స్ సెల్ ని ఏర్పాటు చేయమని కోరగా దానికి విసి గంగాధర రావు సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిసామన్నారు. అలాగే విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ , డాక్టర్ ఎన్. సతీష్, డాక్టర్ పి. వెంకట్ రమణ, డాక్టర్ జీ. వై ఎన్. కిషోర్ కుమార్, ఎస్. చంద్రశేఖర్, డాక్టర్ ఎన్. రాధిక, డాక్టర్ సిహెచ్. సురేష్, డాక్టర్ శివరాం, చిన్నారావు, డాక్టర్ సతీష్, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హిందూ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేయవద్దు'



**(జర్నలిస్ట్ ఫైల్) :** కర్ణాటక శాసనసభలో ప్రతిపక్ష బిజెపి ఉపనాయకుడు అరవింద్ బెల్లాడ్, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఆరోపణలు చేసారు. సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని హిందూ ధార్మిక పర్యాటక ప్రదేశాల అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా నిలిపివేసిందంటూ మండిపడ్డారు. ఆ మేరకు పర్యాటక శాఖకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. హిందువులను దెబ్బతీసి ముస్లిములను బుజ్జగించేందుకే సిద్దరామయ్య ప్రభుత్వం అలాంటి ఆదేశాలు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసారు.

"భారతదేశంలో పుణ్యక్షేత్రాల సందర్శనకు చాలా ప్రాధాన్యం ఉంది. తీర్థయాత్రలు చేయడం, ధార్మిక ప్రదేశాలకు పర్యటించడం మన చరిత్రలో ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. చాలామందికి ప్రయాణాలు అంటే పుణ్యక్షేత్రాల సందర్శనలే. భారతదేశంలో సుమారు 95శాతం మంది పర్యాటకులు ధార్మిక ప్రదేశాలను సందర్శిస్తూ ఉంటారు. అటువంటి ప్రదేశాలను ప్రభుత్వం అభివృద్ధి చేసి నిర్వహించాలి" అని అ-రవింద్ బెల్లాడ్ స్పష్టం చేసారు.

కాంగ్రెస్ ప్రభుత్వపు తాజా ఉత్తర్వులు హిందూ దేవాలయాలను లక్ష్యంగా చేసుకున్నాయని బెల్లాడ్ తీవ్రంగా మండిపడ్డారు. "హిందూ దేవాలయాలు ఉండే ప్రదేశాలను పర్యాటక స్థానాలుగా అభివృద్ధి చేయవద్దంటూ పర్యాటక శాఖకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ సర్క్యులర్ రాష్ట్రంలోని హిందువుల మనోభావాలను దెబ్బతీసింది. ఆ నిర్ణయానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య, పర్యాటక శాఖ మంత్రి ఎచ్. కె. పాటిల్ బాధ్యులు. వారు ఆ ఆదేశాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా హిందువులను సమీకరించి ఆందోళనలు చేపడతాం. ప్రభుత్వం వేల కోట్ల నిధులు కేటాయించి ముస్లిములను బుజ్జగించడానికి ప్రాధాన్యం ఇస్తోంది కానీ హిందువులను నిర్లక్ష్యం చేస్తోంది. ఎందుకు? పర్యాటక శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను ఎందుకు నిలిపివేసారు?" అంటూ బెల్లాడ్ ఆగ్రహం వ్యక్తం చేసారు.

దేవాలయాల్లో అభివృద్ధి పనులకు ముజరాయి విభాగానికి గ్రాంట్లు ఉంటాయన్న సాకు చూపి, పర్యాటక శాఖ ఆలయాల్లో కనీస అభివృద్ధి పనులు సైతం చేపట్టకపోవడం సరి కాదని అరవింద్ బెల్లాడ్ ప్రభుత్వ ఉత్తర్వులను తప్పు పట్టారు. ప్రభుత్వ తాజా ఆదేశాల వల్ల కేవలం చిన్నచిన్న పనులకు మాత్రమే అనుమతులకు అవకాశం ఉంది. భారీ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత వాటిల్లుతోంది. అలాగే, ప్రైవేటు భూముల్లో చేపట్టే లేదా ప్రైవేటు వ్యక్తులు చేపట్టే కార్యక్రమాలకు ఎలాంటి సాయమూ లేకుండా చేయడాన్ని కూడా తప్పుపట్టారు. అటువంటి పనులను గుర్తించి వాటిని తక్షణమే ఆపివేయాలంటూ కార్యనిర్వాహక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



**విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల శ్రీవారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దర్శించుకున్నారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు ఎంపీ తెలిపారు. తనకు ఇచ్చే పుష్ప గుచ్ఛాలకు బదులు పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్ల నిర్వాహణకు చేయూతనివ్వాలని ఆయన కోరారు.

## చోరీ సొత్తుతో పరారవుతున్న లారీ క్లీనర్‌ను పట్టుకున్న పోలీసులు



**నందిగామ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద చోరీ సొత్తుతో పరారవుతున్న లారీ క్లీనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ. 18.52 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నందిగామ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని ఏసీపీ రవికిరణ్ మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం ఏసీపీ కేసు వివరాలను వెల్లడించారు.

"తెలంగాణలోని మధిర నుంచి ఈనెల 17న లారీలో 300 బస్తాల మిర్చిని ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ తీసుకెళ్లారు. అక్కడ విక్రయించిన అనంతరం లారీ డ్రైవర్ షేక్ ఖయ్యూం ఆ డబ్బు తీసుకుని క్లీనర్ పల్లెపోగు కోటేశ్వరరావుతో కలిసి బయల్దేరాడు. అనంతరం క్లీనర్ రూ. 18.52లక్షలతో పరారయ్యాడు. దీంతో నందిగామ పోలీసులకు లారీ డ్రైవర్ ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. వాహనాల తనిఖీ చేపట్టారు. నందిగామ ఆటో స్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న క్లీనర్ కోటేశ్వరరావును పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేశారు" అని ఏసీపీ తెలిపారు.

## విజయవాడలో వైకాపాకి నామరూపాలుండవ్: కేశినేని చిన్నీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలో పలువురు వైకాపా కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి తెదేపాలో చేరారు. పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు మైలవరం లావణ్య, హర్షద్, మైలవరం రత్నకుమారి సహా పలువురు కార్యకర్తలు తెదేపా గూటికి చేరారు. వారందరికీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ) పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. విజయవాడలో విపక్షపార్టీ నామరూపాల్లేకుండా పోతుందని ఆయన అన్నారు. విజయవాడ తెదేపా కంచుకోటగా చరిత్రలో నిలిచిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ నగరాభివృద్ధిని కోరుకుంటూ చాలామంది తెదేపాలో చేరేందుకు ముందుకువస్తున్నారని తెలిపారు.

## చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలి



**అంబాజీ పేట (జర్నలిస్ట్ ఫైల్):** స్వయంకృషితో కష్టపడి మెగాస్టార్ స్థాయికి చేరుకున్న ప్రముఖ సినీనటుడు చిరంజీవిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. అంబాజీపేటలో చిరు కల్యాణ్ సేవా సమితి ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు సిరిగినీడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు గణపతి వీర రాఘవులు, దొమ్మేటి సాయి కృష్ణ కొర్లపాటి వెంకటేశ్వరరావు , అరిగెల సూరిబాబు, సుంకర బాలాజీ ,మహిపాల తాతాజీ, రవన్నం రాము పత్తి దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని అనిపిస్తే వెంటనే వాట్సఅప్ చేయండి



**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్)** 'వాట్సప్ చేస్తే చర్యలు తీసుకుంటాం' కడప జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ తీగలు, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని అనిపిస్తే వెంటనే వీడియో కానీ, ఫొటో తీసి 9440814264 నంబరు వాట్సప్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఎస్సీ రమణ తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో ప్రత్యేక బృందం ద్వారా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా వాట్సప్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# నా పేరు మీద ఫాంహౌస్ లేదు: కెటిఆర్

- మిత్రుడికి చెందిన ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నా
- నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దగ్గరుండి కూల్చేయిస్తా
- స్పష్టం చేసిన బిఆర్ఎస్ సీనియర్ నేత



**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : తన పేరు మీద ఎలాంటి ఫాంహౌస్ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. మిత్రుడికి చెందిన ఫాంహౌస్‌ను తాను లీజుకు తీసుకున్నట్లు వెల్లడించారు. ఆ ఫాంహౌస్ ఎఫ్‌టిఎల్, బఫర్‌లో ఉంటే తానే దగ్గరుండి కూల్చివేయిస్తానని తెలిపారు. ఒకవేళ తప్పు ఉంటే అక్రమ కట్టడాలు కూల్చివేస్తే తనకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం బిఆర్ఎస్ నేతలతో కలిసి కెటిఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రులు, పెద్దపెద్ద కాంగ్రెస్ నేతలు అక్రమంగా కట్టిన ఫాం హౌస్‌లు చూపిస్తానని తెలిపారు. ప్రభుత్వానికి దమ్ముంటే ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి పొంగులేటి, మహేందర్ రెడ్డి, వివేక్ లాంటి కాంగ్రెస్ నాయకుల నిర్మాణాలు కూడా కూల్చేయాలన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎంఎల్‌ఎల రాజభవనాలు కూడా ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్నాయని, వాటిని కూడా కూల్చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా హైడ్రా పేరుతో చేస్తున్న హైడ్రామా ఆపాలని పేర్కొన్నారు. నిజాయితీ ఉంటే ప్రభుత్వానికి ఒకే రోజు అక్రమ నిర్మాణాలను కూల్చాలని సవాల్ విసిరారు. ముందుగా తమ అక్రమ నిర్మాణాలు కూల్చి ప్రజలకు ఆదర్శంగా ఉండాలని ముఖ్యమంత్రికి సూచించారు.అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తనకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. తప్పు తాను చేసినా, కాంగ్రెస్ వాళ్లు చేసినా చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొన్నారు. తన అఫిడవిట్‌లో ఏముందో పబ్లిక్ డొమెయిన్‌లో ఉందని, ఎవరైనా డాక్యుమెంట్ చూసుకోవచ్చని అన్నారు.

### రైతులను కాంగ్రెస్ మోసం చేస్తోంది

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ రైతులను పచ్చి దగా, మోసం చేస్తోందని కెటిఆర్ అన్నారు. రవ్వంత రుణమాఫీ చేసి ఈ ముఖ్యమంత్రి కొండంత డబ్బా కొట్టుకుంటున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ అసలు రైతులకు ఎంత రుణం మాఫీ చేసిందన్నది అటు ముఖ్యమంత్రి సహా మంత్రులకు కూడా తెలుసో లేదోనని కెటిఆర్ అనుమానం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ రైతులను పచ్చి మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం పావు శాతం రుణమాఫీ చేసి, వందశాతం రైతులను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రేమో మొత్తం రుణమాఫీ అయిపోయిందంటే, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి మాత్రం ఇంకా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందని చెబుతున్నారని చెప్పారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాత్రం కేవలం రూ. 7500 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో జమ అయ్యాయని చెబుతున్నారని..మరీ ఏదీ నిజం, ఏది రైతులు నమ్మాలో చెప్పాలని అడిగారు. రైతులకు, వ్యవసాయ రంగానికి ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఈ రైతు ద్రోహి ప్రభుత్వాన్ని వదిలిపెట్టకుండా వెంటాడుతాం, వేటాడుతామని హెచ్చరించారు. అందుకే గురువారం నుంచి మొదటి అడుగు రైతు ధర్నాతో ప్రారంభిస్తామని అన్నారు. కేవలం మీడియాను, హెడ్ లైన్స్‌ను మేనేజ్ చేసి రైతు రుణమాఫీ నుంచి దృష్టి మరల్చాలని చూస్తున్నారని, ఆ ఆటలు ఎంతోకాలం సాగవని స్పష్టం చేశారు. ఈ దగాకోరు సర్కార్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, రైతులకు రేవంత్ రెడ్డి చేసిన చీటింగ్‌పై బిఆర్ఎస్ పోరాటం ఆగదని కెటిఆర్ వెల్లడించారు.

---

**ఆసుపత్రులలో మహిళలు, చిన్నారుల నగ్న వీడియోల చిత్రీకరణ**

# అమెరికాలో భారతీయ ఉన్మాద డాక్టర్ అరెస్ట్

- స్పృహలో లేని మహిళలనూ వదలని వైనం
- భార్య ఫిర్యాదుతో వెలుగులోకి..
- 13వేల వీడియోలు స్వాధీనం

**వాషింగ్టన్ :** అమెరికాలో భారతీయ సంతతికి చెందిన వికృత ఉన్మాద చర్యల 40 ఏండ్ల డాక్టరు ఒయిమొయిర్ ఎజాజ్ జైలుపాలయ్యాడు. మిచిగాన్ స్టేట్‌లోని ఒక్లాండ్ కౌంటీలో రోచెస్టర్ హిల్స్‌లో ఆయన ఇంట్లో వేలాది నగ్న ఫోటోల వీడియోలు లభించాయి. చివరకు రెండు సంవత్సరాల బాలబాలికలు మొదలుకుని అనేక వయస్సుల వాళ్ల దిగంబర ఫోటోలు తీయడం, వీటిని వీడియోలుగా తీయడం వంటి పలు లైంగిక నేరాభియోగాలు ఆయనపై నమోదు అయ్యాయి. చాలా సంవత్సరాలుగా మహిళలను , పసివాళ్లను తన వికృత చేష్టలకు పావులుగా వాడుకుంటూ వస్తున్న ఎజాజ్ గురించి చివరికి ఆయన భార్య ఫిర్యాదుతో స్పష్టం అయింది. సంబంధిత డాక్టర్ అశ్లీల శృంగార నేరాల వ్యవహారం గురించి స్థానిక ఫాక్స్ న్యూస్ సమగ్ర వార్తా కథనం వెలువరించింది. ఈ నెల 8వ తేదీన ఈ డాక్టరును అరెస్టు చేశారు. పలు చోట్ల ఆయన బాత్‌రూంలలో రహస్య కెమెరాలు పెట్టడం, తన ఆసుపత్రిలో కూడా ఇటువంటి ఏర్పాట్లు చేసి చికిత్సకు వచ్చే వారి నగ్నచిత్రాలు తీసేవాడని వెల్లడైంది. చివరికి తన ఇంట్లో కూడా ఇటువంటి రహస్య కెమెరాలు పెట్టినట్లు గుర్తించారు. మహిళలను స్పృహతప్పేలా చేసి, అత్యాచారాలకు పాల్పడినట్లు తెలిపే వీడియోలు కూడా లభించాయి. ఆయన భార్య ఈ అత్యంత జుగుప్సాకర వీడియోలను ఇతర సాధనాలను పోలీసులకు అప్పగించారు. దీనితో ఇప్పటివరకైతే ఆయన ఎన్ని లైంగిక నేరాలకు పాల్పడింది లెక్కలోకి రాలేదు. మొత్తం నేరం వివరాలను నిర్ధారణ అయ్యేసరికి నెలలు పడుతుందని స్థానిక షెరీఫ్ మైక్ బౌచర్డ్ తెలిపారు. ఇంతకు ముందు స్పోర్ట్స్ డాక్టరు లారీ నసీర్ పాల్పడ్డ లైంగిక వికృత చర్యలను ఈ డాక్టర్ ఉన్మాదం తలపిస్తోందని వివరించారు. ఈ డాక్టరు నివాసం నుంచి ఇప్పటికే కంప్యూటర్లు, ఫోన్లు, 15 వరకూ బాహ్య పరికరాలు స్వాధీనపర్చుకున్నారు. అక్కడ దొరికిన ఒక్క హార్డ్ డిస్క్ డ్రైవ్‌లోనే 13000 వరకూ వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఆసుపత్రికి వచ్చే వారి నగ్న వీడియోలు తీయడం , కొందరిపై అత్యాచారాలకు పాల్పడ్డట్లు కూడా సాక్ష్యాలతో వెల్లడైంది. స్విమ్ స్కూల్‌కు వచ్చే చిన్నారుల నగ్నచిత్రాలను కూడా తీసే వాడని గుర్తించారు. ఇంతకు ముందు ఎటువంటి నేర చరిత్ర లేకుండా ఉన్న ఈ డాక్టరు పలు ఆసుపత్రులలో పనిచేశాడు. భారత్ నుంచి వర్క్ వీసాపై 2011లో అమెరికాకు వచ్చిన ఈ డాక్టరు 2018 నుంచి మిచిగాన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అరెస్టు తరువాత ఆ డాక్టరును జైలుకు పంపించారు. దీనికి ముందు 2 మిలియన్ డాలర్ల బాండ్ కూడా తీసుకున్నారు.

---

**కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ఎదుట**

# రైతన్నల ధర్మాగ్రహం

- చనిపోయిన గేదెలతో కిష్టాయపల్లి రైతుల నిరసన
- చెరువును విషమయం చేశారు
- మనుషులు చనిపోతున్నారు..గేదెలు చనిపోతున్నాయని రైతుల ఆక్రోశం
- సనత్‌నగర్ కాలుష్య నియంత్రణ మండలి ముందు నిరసన



**జర్నలిస్ట్ ఫైల్** /అమీర్‌పేట్ : ఓ పరిశ్రమ నుంచి వెలువడిన విషపూరిత జలాలను తాగి ఆరు గేదెలు మృతిచెందగా, మరో నాలుగు గేదెలు విషమ పరిస్థితిలో ఉండటం స్థానిక రైతులకు ఆగ్రహం తెప్పించింది. పలు పర్యాయాలు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని నిరసిస్తూ ఏకంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం ముందు మృతిచెందిన గేదెలతో నిరసన వ్యక్తం చేశారు. బాధిత రైతును ఆదుకుని...సదరు పరిశ్రమ యజమానులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కిష్టాయపల్లికి చెందిన రైతు బాశెట్టిగారి సాయికిరణ్ పది పాడిగేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. ప్రతి నిత్యం సమీపంలో గేదెలను మేపేవాడు. ఎప్పటిలాగే గడ్డిపోతారం గ్రామంలోని గేదెలు మేసి సమీపంలో ఉన్న అయ్యమ్మ చెరువులో నీటిని తాగాయి. స్థానికంగా ఉన్న రసాయన పరిశ్రమ నుంచి వెలువడిన విషపూరిత వ్యర్థాలను చెరువులోకి వదులుతుండటంతో ఈ జలాలను తాగిన గేదెల్లో ఆరు మృతిచెందగా, మరో నాలుగు విషమ పరిస్థితిలో ఉన్నాయి.పరిశ్రమ నుంచి వెలువడిన విషపూరిత వ్యర్థాల వల్లే గేదెలు చనిపోవడంతో రైతులు మృతిచెందిన గేదెలతో కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వీటి ఖరీదు రూ.30 లక్షలు ఉంటాయని, సాయికిరణ్‌కు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. చెరువును విషపూరితంగా చేసిన పరిశ్రమపై చర్యలు చేపట్టాలని, కలుషితం కాకుండా చూడాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

---

# పాత మొబైల్ ఫోన్లతో సైబర్ నేరాలు

**ముగ్గురు అరెస్టు**

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : పాత మొబైల్ ఫోన్లు కొంటున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. నలుగురు సభ్యులుగా గల ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నారని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి 3 గోనె సంచుల్లో 4 వేల మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరగాళ్లు సైబర్‌క్రైమ్‌ల కోసం పాత ఫోన్లను వాడుతున్నారని పోలీసులు గుర్తించారు. వాడిన మొబైల్ ఫోన్లకు డబ్బులు ఇచ్చి లేదా ప్లాస్టిక్ సామాన్ ఇచ్చి ఫోన్లు కొంటున్నారు. బీహార్‌కి చెందిన మహమ్మద్ షమీ, అబ్దుల్ సలాం, మహమ్మద్ ఇఫ్తికర్‌ని గోదావరి ఖని పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాలోని మరో సభ్యుడు అఖ్తర్ అలీ పరారీలో ఉన్నాడు. గోదావరిఖని పవర్ హౌజ్ కాలనీలో పాత మొబైల్ ఫోన్స్ కొంటుండగా పట్టుకున్నారు. ఈ ముఠా తెలంగాణ జిల్లాల్లో గ్రామ గ్రామాన మొబైల్ ఫోన్లు కొని బీహార్ మీదుగా జామ్ తారా, దేవ్ ఘర్, జార్ఖండ్ తరలిస్తోంది. సైబర్ నేరగాళ్లకు అమ్మే ముందు.. మొబైల్ ఫోన్స్‌లో సాఫ్ట్ వేర్ మార్చడం, ఇతర విడిభాగాలు మార్చి ఫోన్ పనిచేసేలా చేస్తున్నారు. అనంతరం అందులో ఉన్న డేటాను సైబర్ నేరగాళ్ల చేతికి అందజేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు మీ పాత ఫోన్లను అమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

---

# రానున్న రోజుల్లో అధికారం బిజేపిదే

- సభ్యత్వ నమోదు రికార్డును అధిగమించాలి
- అన్ని పంచాయతీల్లో బిజెపి పోటీ చేస్తుంది
- సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ముక్తి దివస్'గా నిర్వహిస్తాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి




**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్, బిఆర్ఎస్‌ది కాదని బిజెపిదేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాల అమల్లో దారుణంగా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు హాల్లో బుధవారం జరిగిన బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, కేంద్రమంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, కర్ణాటక బిజెపి నేత, ఆ రాష్ట్ర ఎమ్మెల్యే అభయ్ పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో బిజెపి అన్ని పంచాయతీల్లో పోటీ చేస్తుందని ప్రకటించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై విమర్శల దాడి చేశారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు కలిగిన ఏకైక పార్టీ బీజేపీగా గిన్నిస్ రికార్డులోకి ఎక్కిందని అన్నారు. 2024లో మరింత ఎక్కువ సభ్యత్వ నమోదు చేసి మన రికార్డును మనమే అధిగమించాలని కిషన్ రెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిజెపి సిద్ధాంత పరంగా పనిచేస్తోందని, క్రమం తప్పకుండా సభ్యత్వాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలు ఇష్టంతో సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావాలని అన్ని వర్గాల్లో ఉందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు సభ్యత్వ నమోదు ఎంతో దోహదపడుతుందని సూచించారు. కుటుంబ పార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్ అవినీతికి పాల్పడుతున్నాయని కేంద్రమంత్రి మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల స్ఫూర్తితో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా తెలంగాణలో పెద్దగా మార్పు రాలేదని అన్నారు. ప్రజలు ఈ రెండు పార్టీల పట్ల విసిగిపోయి ఉన్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బిజెపి అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించారు.

### రుణమాఫీ 50 శాతం కూడా చేయలేదు

రాష్ట్రంలో రుణమాఫీపై రైతులకు ఆశలు పెట్టి 50 శాతం కూడా మాఫీ చేయలేదని మండిపడ్డారు. బిఆర్ఎస్ ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో, అలాగే కాంగ్రెస్ కూడా మోసం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఏ గ్రామంలో కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రుణమాఫీకి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు.

### హైడ్రానా..హై డ్రామానా?

అక్రమ నిర్మాణాల పేరుతో హైడ్రా నేతృత్వంలో జరుగుతున్న కూల్చివేతలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇంతకి ఇది హైడ్రా నా, హై డ్రామానా తెలియడం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ప్రభుత్వ యంత్రాంగం అంతకు ముందు ఏం చేసిందని, అధికారులు అనుమతులు ఏ ప్రాతిపదికన ఇచ్చారని నిలదీశారు. ప్రభుత్వం సమగ్రమైన కార్యాచరణతో ముందుకు వెళ్ళాలని డిమాండ్ చేశారు.

---

# సీఎం రేవంత్‌తో సీపీఎం నేతల భేటీ



**జర్నలిస్ట్ ఫైల్** / హైదరాబాద్ : తెలంగాణ సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సీపీఎం నాయకులు భేటీ అయ్యారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో బీవీ రాఘవులు, జూలకంటి రంగారెడ్డి, తదితరులు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ నేపథ్యంలో ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ కాంగ్రెస్ తో కలిసి పోటీ చేయగా సీపీఎం మాత్రం ఒంటరిగా పోటీ చేసింది. అనంతరం జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సీపీఎం కాంగ్రెస్ కు మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. ఈభేటీలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కూడా పాల్గొన్నారు.

---

# రుణమాఫీపై నేడు బిఆర్ఎస్ ధర్నాలు

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం(ఆగస్టు 22) అన్ని మండల కేంద్రాలు/నియోజకవర్గ కేంద్రాల్లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మహేశ్వరం ఎంఎల్‌ఎ పి. సబితా ఇంద్రారెడ్డి, పలువురు పార్టీ నేతలతో కలిసి చేవెళ్ల మండల కేంద్రంలో రైతుల ధర్నా కార్యక్రమంలో పాల్గొంటారు. సిఎం, మంత్రివర్గం చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా గురువారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా ధర్నాలు చేపడతామని కెటిఆర్ ప్రకటించారు. రైతులకు సంపూర్ణ రుణమాఫీ జరిగేంత వరకు బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గాలు, మండల కేంద్రాలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మాజీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

### నేడు యాదాద్రిలో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు

ప్రభుత్వం రుణమాఫీ చేయడంలో విఫలమవడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలేరులో నిర్వహించే రైతు ధర్నాలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌రావు పాల్గొననున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఒట్టు వేసి మాట తప్పిన నేపథ్యంలో రాష్ట్రానికి కీడు జరగకూడదని హరీశ్‌రావు యాదాద్రి లక్ష్మి నరసింహా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, వివేక్ గౌడ్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, కాలేరు వేంకటేష్, ముఠా గోపాల్, ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్, నవీన్ రావు, మాజీ ఎంఎల్‌ఎలు శేఖర్ రెడ్డి, భిక్షమయ్య గౌడ్, సునీతా మహేందర్ రెడ్డి, మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవి ప్రసాద్, పల్లె రవి, రాజీవ్ సాగర్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొంటారు.

---




# నేడు ఇడి ఆఫీసుల వద్ద కాంగ్రెస్ ఆందోళనలు

**ఎఐసిసి అధికార ప్రతినిధి మధుయాష్కీ గౌడ్ వెల్లడి**

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : ప్రభుత్వ సంస్థలను అదానీకి పనికొచ్చే విధంగా మార్పు చేశారని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మధుయాష్కీ గౌడ్ విమర్శించారు. ఎన్‌డిటివి, అంబుజా సిమెంట్, జివికె గ్రూప్స్‌పై ఇవి దాడి చేస్తే.. అన్ని కంపెనీలు అదాని పరమయ్యాయని ఆరోపించారు. మోడీ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 22న ఇడి కార్యాలయాల వద్ద కాంగ్రెస్ ఆందోళన చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. మోడీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అల్ట్రాటెక్ సిమెంట్‌పై అదానిపై కామెంట్ చేస్తే సిబిఐ రైడ్ చేసిందని ఆరోపించారు. అదాని కంపెనీల్లో ఎస్‌బిఐ, ఎల్‌ఐసి షేర్లు పెడుతున్నాయని... ఎవరి ప్రోద్బలంతో అదాని కంపెనీల్లో ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ షేర్లు పెడుతున్నదో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మోడీ విదేశీ పర్యటనలో కూడా అదానిని తీసుకొని వెళ్లి కాంట్రాక్టులు ఇప్పిస్తున్నారని అన్నారు. అదాని, అంబానీలతో వ్యాపారాలకు మోడీ అండదండలు ఇస్తున్నారని...మాట వినని కార్పొరేట్ సంస్థలను ఈడి, ఐటీలతో రైడ్స్ చేయిస్తూ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన జీవీకే గ్రూప్స్, కృష్ణపట్నం పోర్ట్ వాళ్లను బెదిరించారన్నారు. దేశంలోనే కాకుండా శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల్లో అదాని గ్రూప్స్‌కే కంపెనీ అనుమతులు ఇవ్వాలని మోడీ ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. దేశ సంపదను అదాని గ్రూప్స్ ద్వారా బయట దేశాలకు తరలిస్తున్నారన్నారు. మనీలాండరింగ్‌కి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మోడీ, అదాని, సెబీ చైర్‌పర్సన్ ముగ్గురు కలిసి దేశ సంపదను దోచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ అవినీతిపై దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మీడియా సమావేశాలు పెట్టామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ సంస్థల అభివృద్ధి కోసం వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

---

**జి.ఓ.111 పరిధిలో**

# పుట్టగొడుగుల్లా ఫామ్‌హౌజ్‌లు

- ఉస్మాన్, హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో జోరుగా నిర్మాణాలు
- కోట్లలో సాగుతున్న రియల్ దందా
- 'హైడ్రా' వైఖరి ఎలా ఉండబోతోందని సర్వత్రా చర్చ



**జర్నలిస్ట్ ఫైల్** /సిటీ బ్యూరో: హైదరాబాద్ నగర శివారులోని చారిత్రాత్మక జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరివాహక ప్రాంతంలో అనుమతులు లేకుండా వెలసిన ఫాం హౌజ్‌ల పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు అన్నివర్గాల్లోని చర్చ. ఆ ఫాంహౌస్‌లపై చర్యలు ఉండవా ? అవి సంపన్న వర్గాలకు చెందినవి కావడమే అవి చేసుకున్న పుణ్యమా ? అంటూ పలువురు వేలెత్తి చూపుతున్నారు. జలాశయాల పరిధిలో విలాసవంతంగా ఏర్పాటు చేసుకున్న అక్రమ నిర్మాణాల సంపన్న వర్గాలకు ఓ రూల్, చెరువు పరిధిలో నివాసాలను నిర్మించుకున్న సాధారణ జనానికి ఓ రూలా ? అనే ప్రశ్న బలహీన వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. మామూలుగా రేకులతో వేసుకున్న ఇండ్లను చెరువుల్లో ఉన్నాయంటూ నేలమట్టం చేయిస్తున్న ప్రభుత్వానికి నగర ప్రజల దాహార్తిని తీర్చుతున్న జంటజలాశయాల పరివాహక ప్రాంతంలో అనుమతులు లేకుండా ఫాంహౌజ్‌లు, ఫంక్షన్‌హాల్స్, రిసార్ట్స్, విల్లాలపై చర్యలు లేకపోవడమే అందరి మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్న.

### హెచ్ఎండిఏ మాస్టర్‌ప్లాన్ ఉన్నా..

జంట జలాశయాల పరివాహక ప్రాంతంలో ఫాం హౌస్‌లు, రిసార్ట్స్, ఫంక్షన్‌హాల్స్‌లను నిర్మించి ఒక్క రోజుకే లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్నారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫాం హౌస్‌ల పేరిట రియల్ దందా నడిపిస్తున్నారు. లేఅవుట్లు చేసి ప్లాట్లను అడ్డగోలు రేట్లతో బిజినెస్ చేస్తున్నారు. జంట జలాశయాల ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. పరివాహక ప్రాంతాన్ని కాంక్రీట్ జంగిల్‌గా తయారు చేస్తున్నారు. దాదాపు 11వేల వరకు అక్రమ నిర్మాణాలున్నట్లు అధికార వర్గాల్లోని సమాచారం. బహుళ అంతస్థలు భవనాలు నిర్మితం కావడంతో జంట జలాశయాలకు కాలుష్యం ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడి భూముల్లోని భవనాలకు అనుమతులు లేవు. భూవినియోగ మార్పిడి అంతకన్నా లేదు. అయినా, విలాసవంతమైన నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. చర్యలు మాత్రం కనిపించడంలేదు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట్), హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరివాహక ప్రాంతంలో నిర్మాణాలపై షరతులు విధిస్తూ 1996, మార్చి 8న అప్పటి ప్రభుత్వం జీఓ నెం.111ను తీసుకొచ్చింది. ఈ జీఓ ప్రకారంగా జంటజలాశయాల పరివాహక ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టాలంటే జీఓ 111 నియమాలను అనుసరించడం తప్పనిసరి. ఈ పరివాహక ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టాలంటే ముందుగా హెచ్ఎండిఏ నుంచి భూవినియోగ మార్పిడి చేయడంకూడా తప్పనిసరి. భూవినియోగ మార్పిడి లేకుండా గ్రామ పంచాయితీలు, మునిసిపాలిటీలు అనుమతులు మంజూరు చేయడం మాస్టర్‌ప్లాన్ నియమాలను ఉల్లంఘించడమేనని అధికారులు వెల్లడిస్తున్నారు.

### కోట్లలో ముడుపులు.. చక్రం తిప్పుతున్న నేతలు

పరివాహక ప్రాంతంలో నిర్మాణం చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు పాత తేదీల్లో అనుమతులు మంజూరు చేస్తున్నారనేది హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్యలతో వెలుగులోకి వచ్చాయి. భూముల ధరలను పరిగణలోకి తీసుకుని అవినీతి కోట్లలో చేతులు మారుతున్నట్టు ఇటీవల గండిపేట్ కూల్చివేతలతో బహిర్గతమైంది. రాజకీయ నేతలు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు తమ పలుకుబడిని ఉపయోగించి జంట జలాశయాల పరివాహక ప్రాంతంలో నిర్మాణాలు సాగేలే చేస్తున్నారనే తేలిపోయింది. ఇక్కడ నిర్మాణాలతో వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

# రైతులకు కోతలు లేని తూకాలు జరిగేలా చూడాలి

## రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత




ఎమ్మిగనూరు. ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు కోతలు లేని తూకాలు కచ్చితంగా జరిగేలా చూడాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీలు భాగంగా యార్డులో పర్యటించి రైతులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ పచ్చి వేరుశనగ పంటను ఆరబెట్టుకోవాడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఆహార వైద్య సేవలు విశ్రాంతి భవనం సదుపాయాలు తాగునీటి మౌలిక వసతులు వందశాతం అమలు చేయాలన్నారు.

అసంపూర్తిగా మిగిలి పోయిన పనులను టెండర్లు పిలిచి పూర్తి చేయా ఓలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట మార్కెటింగ్ శాఖ జేడి రామాం జనేయులు, డీడీ శ్రీకాంత్ రెడ్డి, ఏడీ సత్యనారాయణ, కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, డీఇ సుబ్బారెడ్డి ఉన్నారు.

# గోళ్ళాపురంలో నాగదేవత ఆలయానికి భూమి పూజ

## -ప్రత్యక్షమైన నాగ సర్పం




హిందూపురం, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : హిందూపురం రూరల్ పరిధిలోని గోళ్ళాపురం గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన శివాలయం ఆవరణంలో శిథిలావస్థలో ఉన్న పురాతన మైన మండపాన్ని తొలగించి తిరిగి నూతన ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని గ్రామస్తులు సంకల్పించారు. బుధవారం భూమి పూజ చేస్తుండగా ఆకస్మతికంగా పొడవైన ఓగోధుమ రంగునాగు పా ము ప్రత్యక్షమైన సంఘటన వెలుగుచూసింది. ఈ సంద ర్భంగా అతి పురాతన మైన శివాలయ ముఖ ద్వారం కుడి ప్రక్కన రాతి స్తంభాల తో ఓ మండపం ఉన్నది. దా ని పక్కనే నాగులు పుట్ట ఆవి ర్భవించింది.

దాతల సహ కారంతో లక్షలాది రూపాయ లతో శివాలయ పునర్నిర్మాణం, కళ్యాణ మండపం నిర్మించారు. ఇక ఆలయం ఆవరణంలో ఉన్న మండపాన్ని తొలగించి అక్కడ శివుని విగ్రహం ప్రతిష్టించాలని గ్రామస్తులు సంకల్పించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం కోసం బుధవారం గ్రామస్తుల సమక్షంలో వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజా కార్యక్రమంలో పదుల సంఖ్యలో జనాలు, పండితులు ఉన్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా పొడవైన గోధుమ రంగు నాగుపాము పూజ చేస్తున్న ప్రదేశంలో ప్రత్యక్షం కావ డంతో భక్తాదులు గ్రామస్తు లు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇదంతా దైవసంకల్పమని భావించిన భక్తాదులు ప్రత్యక్షమైన నాగుపాముకి భక్తాదులు చేతుల జోడించి మ్రొక్కులు తీర్చుకున్నారు.

ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా నాగదేవత కొలువై ఉన్నారని తాము నిర్మించే ఆలయం నాగదేవత ఆలయంగా రూపకల్పన చేయాలని గ్రామస్తులు భావించారు. ఈ ఆలయ నిర్మాణానికి ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఏసీ నాగరాజు విరివిగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిలమత్తూరు కి చెందిన వాస్తు శిల్పి, ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కార్యదర్శి రంగధామప్ప, సర్పంచ్ దేవరాజ్, వైసీపీ సీనియర్ నాయకుడు తిప్పే రుద్రయ్య, మల్లప్ప, మాజీ జెడ్పిటిసి కేఎల్ ఆదినారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎగువ కురిసిన భారీ వర్షానికి హంద్రీ వరద ఉధృతిలో

# దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జెసి బి. నవ్య




దేవనకొండ , ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి హంద్రీ వాగు వరద ఉధృతికి దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య బుధవారం మండలంలోని తెర్నేకల్లు, పొట్లపాడు గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో హంద్రీ వాగు పరివాహక ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన పత్తి, ఉల్లి, మిరప, జొన్న, కంది తదిత పంట పొలాల్లోకి వరద నీరు ఏ మేరకు చేరి రైతులకు ఏమాత్రం పంట నష్టం వాటిలిందని అంచనా వేయుటకు సంబంధిత రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులతో పర్యటించారు. పంట నష్టం అంచనా వివరాలను సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హంద్రీ వాగు లో ముళ్ళ కంపలు, చెట్లు పెరగడంతో వరద ప్రవాహం సక్రమంగా ముందుకు పోవడం లేదని పంట పొలాల్లోకి వరద నీరు ప్రవహిస్తున్నట్లు తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్ జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చెట్ల తొలగింపు చేపట్టేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డిఓ రామలక్ష్మి, స్థానిక తహసిల్దార్ జయన్న, రెవెన్యూ ,వ్యవసాయ శాఖ అధికారులు దాదావలి, ఆనంద్ కుమార్, రాముడు, జయ రాము, రంగన్న, యోగేంద్ర, సలీం పాల్గొన్నారు.

# తిరుమలకు విచ్చేసే భక్తుల ఆరోగ్య భద్రత టిటిడి ప్రథమ కర్తవ్యం

## హెూటల్ యజమానులకు ఫాస్టాక్ (ఎఫ్ఓఎస్ టిఏసి) శిక్షణ

## టీటీడీ అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి




తిరుమల, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతోపాటు వారి ఆరోగ్య భద్రతే టిటిడి అత్యంత ప్రాధాన్యత అని టీటీడీ అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. టిటిడి ఇఓ జె. శ్యామలరావు ఆదేశాల మేరకు టిటిడి ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హెూటళ్ల నిర్వాహకులకు, యజమానులకు తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ సత్సంగం హాల్లో బుధవారం నాడు జరిగిన శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో ప్రసంగిస్తూ, అన్ని రకాల తినుబండారాలు ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని అన్నారు.

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే వేలాది మంది భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం హెూటళ్ళను నిర్వహించాలన్నారు. హెూటళ్ల లోపల పరిశుభ్రత, ఆహార పదార్థాలు నిల్వ చేయడం, వడ్డించడం వంటి విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించి క్రమ బద్ధీకరించడం, తదితర విషయాలను నిశితంగా పరిశీలించాలని ఆయన హెూటళ్ల వారికి చెప్పారు. తరువాత న్యూ ఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ శ్రీ సిహెచ్ ఆంజనేయులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్మెంట్ సిస్టమ్లో అన్ని రెస్టారెంట్లు మరియు తినుబండారాలలో అనుసరి ంచాల్సిన పరిశుభ్రత మరియు పారిశుద్ధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక-రసాయన-జీవ ప్రమాదాలు, వృధా వంటి వాటి గురించి వివరించారు, నిబంధనలను ఉల్లం ఘిస్తే తీసుకునే చర్యలు వంటి అనేక అంశాలను తెలియజేశారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీ ఇఓ ఆశాజ్యోతి మాట్లాడుతూ, ఇక నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి తిరుమలలో హెూటళ్ల వ్యాపారులందరికీ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల హెల్త్ ఆఫీసర్ మధుసూధన్ రావు, తిరుపతి జిల్లా ఫుడ్ కంట్రోలర్ జి. వెంకటేశ్వరరావు, తిరుమల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, తిరుమలలోని హెూటళ్ల వ్యాపారులు, టిటిడి అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.

# తాళ్లూరు ఎస్ఐగా మల్లిఖార్జున రావు బాధ్యతలు స్వీకరణ



తాళ్లూరు , ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : తాళ్లూరు ఎస్ఐగా ఎస్ మల్లిఖార్జున రావు బుధవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. గ్రామాలలో ఎవైనా సమస్యలు ఉంటే నేరుగా తననే సంప్రదించాలని కోరారు. బాధ్యతలు స్వీకరిం చిన ఎస్ఐ కు పలువురు అభినందనలు చెప్పారు.

# గ్రామస్వరాజ్య సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ఏపీ శివయ్య వెల్లడి



ఐరాల, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని జనసేనపార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఏపి శివయ్య వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 23వ తేదీన 13,326 గ్రామ పంచాయతీలకు గ్రామ సభలు ఒకేసారి నిర్వహిస్తు న్నా ం - అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాధిపతి పవన్ కళ్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో విలేకరులతో ఏపీ శివయ్య మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన జరగనున్న గ్రామసభలలో జనసేన శ్రేణులు అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధిలో జనసైనికులు, కూటమి నాయకులు, వీరమహిళలు అందరూ భాగస్తులై అధికారులకి, ప్రజలకి అండగా ఉండాలని ఏపీ శివయ్య కోరారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే మా అధినేత పవన్ కళ్యాణ్ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో ఆయన కల నెరవేరడం మన అందరికీ సంతోషకరమైనదని శివయ్య తెలియజేశారు. అదేవిధంగా పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత, నీతి, నిజాయితీ ఖచ్చితంగా ఉండాలని ఏపీ శివయ్య చెప్పారు. గ్రామంలో ప్రజల కోరికల మేరకు గ్రామ అభివృద్ధికి నాయకులు అందరూ సహకరించి మన పంచాయతీలని దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ గా తీర్చిద్దాలని పిలుపునిచ్చారు. అధికారులకు ఎటువంటి సహకారం అయినా జనసైనికులు, వీర మహిళలు అందరు సహకరిస్తారని ఈ సందర్భంగా శివయ్య తెలిపారు.గ్రామ స్వరాజ్యం దిశగా పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రక్షాళన మొదలుపెట్టిన ఘనత ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కే చెల్లిందని చెప్పారు. వైఎస్ఆర్సీపీ పార్టీ హయాంలో ఒక్క గ్రామసభ కూడా నిర్వహించకుండా పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని శివయ్య దుయ్యబట్టారు. ఆగస్టు 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామసభలు ఏకకాలంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీపనులపై, రైతాంగానికి ఉపాధి హామీపథకం అమలు, వినియోగంపై చర్చలు నిర్వహించి ఆమోద ముద్రవేసి, పంచాయతీలకు పునర్వైభవం కూటమి ప్రభుత్వం తీసుకు రానున్నదని, పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలని పెద్దలు చెప్పిన మాట ఋజువు చేస్తామని, దీనికోసం జనసేన శ్రేణులు అందరూ శక్తివంచన లేకుండా కృషి చేస్తామని శివయ్య వివరించారు.

# శివారు ప్రాంతాల్లో పరిశుభ్రతకు నిలయం



ఎమ్మిగనూరు, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : పట్టణంలోని శివారు ప్రాంతాల్లో అపరి శుభ్రతను తొలగించి పరిశుభ్రతకు నిలయంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణం లోని సోమప్ప సర్కిల్, సోగనూర్ రోడ్డు ఏరియా నందు మేజర్ డ్రైన్ పూడికతీత పనులు పరిశీలిం చడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడు తూ పట్టణంలో మురికి కాలువలు పేర్కొని నీరు నిల్వలు వలన దోమలు వృద్ధి చెంది దోమల కారణంగా ప్రజలు నానా వ్యాధులు గురి కాకుండా ముందస్తుగా మురికి కాలువల పూడిక తీత పనుల ను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. ఈ. మదన్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు బోనస్ పంపిణీ



ముండ్లమూరు ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : రైతులకు బోనస్ ఇచ్చేది కృష్ణ మిల్క్ యూనియన్ ఒక్కటేనని ముండ్లమూరు మండలంలోని, ఈదర గ్రామంలో తేది 21.08.2024 న మాసంలకు, కృష్ణ మిల్క్ యూనియన్, విజయ డైరీ వారు గడిచిన నాలుగు నెలలు అనగా ఏప్రిల్ 2024 నుంచి జూలై 2024 వరకు నూటికి ఏడు శాతం చొప్పున అనగా 3 లక్షల రూపాయిలు ఈదర గ్రామంలో పాడిరైతులకు పంచినారు.కృష్ణ మిల్క్ యూనియన్ వారు సుమారుగా ఒక కోటి డబై లక్షల రూపాయలు బోనస్ నీ ప్రకాశం జిల్లా పాడి రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణ మిల్క్ యూనియన్, ప్రకాశం జిల్లా మేనేజర్ హెచ్చు. దిలీప్ కుమార్, సూపర్వైజర్ జి. సుబ్బారెడ్డి మరియు ఈదర సంఘం అధ్యక్షులు యరబోలుశ్రీకాంత్ రెడ్డి పాలు పోసే పాడి రైతులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్



కడప ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : వై.ఓ. నందన్ మార్నింగ్ వాక్ లో భాగంగా శ్రీరామ్ నగర్, కాకర్ల సుబ్బారెడ్డి కాలనీ,ఎర్రముక్కపల్లి, గోశాల,అంగడి వీధి రిమ్స్ హాస్పిటల్ ప్రాంతాలని ఇంజ నీరిం గ్, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో కలసి సందర్శించారు. కమిషనర్ శ్రీరామ్ నగర్ నందు రోడ్డు పై కాలువ నీరు నిలిచి ఉండటంపై వచ్చినటువంటి పిజిఆర్ ఎస్ కంప్లైంట్ పరిశీలించారు.శ్రీరామ్ నగర్ నుండి సబ్ జైల్ వరకు కచ్చా డ్రైన్ ఏర్పాటు కొరకు వెంటనే ప్రణా ళికలను సిద్ధం చేసి పనుల ను ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.సబ్ జైల్ ఆపోజిట్ రోడ్డు నందు ఉన్నటువంటి కల్వర్టు డి- సిల్టేషన్ పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని శానిటేషన్ విభాగ అధికారులను ఆదేశించారు.కాకర్ల సుబ్బారెడ్డి కాలనీ నందు ప్రజలకు నీటి సరఫరా అందించుటకు ఇంజనీరింగ్ బాగా అధికారులతో కలిసి పరిశీలించి నీటి సరఫరా కొరకు అవసరమగు పైప్ లైన్స్ నాకు సంబంధించి ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి పైప్ లైన్స్ ఏర్పాటు చేయవలసిందిగా ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.

# బంద్ ప్రశాంతం



ఎమ్మిగనూరు, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ప్రయివేట్ సంస్థలు బుధ వారం బంద్ ను ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ రాజకీయ స్వలాభం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లు వర్గీకరణ చేయడం జరిగిందని, రాజకీయ ఎత్తుగడలతో అన్నదమ్ముల లాంటి ఎస్సీలను విభజించడం దారుణమన్నారు. ఎస్సీ వర్గీయులు 59 ఉపకలాలను వారి స్వలాభం కోసం విభజించి పాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వర్గీకరణ వ్యతిరేకం కోసం మాల మహానాడు నాయకులు ఐక్యంగా ఉండి ప్రాణాలు అర్పించడాని సిద్ధంగా ఉన్నామని ఎద్దేవా చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఉష మొహరం కమిషన్ ద్వారా తీర్పు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజకీయ స్వలాభం కోసమే వర్గీకరణ చేయడం జరిగిందన్నారు. ఇలాంటి వర్గీకర ణలను సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సిగ్గుచేటని ఇలాంటి తీర్పులు వల్ల ప్రజలు సుప్రీంకోర్టు మీద ఉన్న నమ్మకం పోతుందని సూచించారు. వర్గీకరణ వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో మళ్లీ పెద్ద ఎత్తున ఆందో ళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల. నరసన్న, మాల మహానాడు నాయకులు మాల పంపయ్య, మాల రాజోలప్ప, ఎద్దుల చెన్నయ్య, మాల మధుబాబు, మాల. మురలీకృష్ణ, బుదుమెద్దుల రవిచంద్ర, మాల నరసప్ప, గడ్డం నాగేంద్ర, మాల సత్యనారాయణ, మాల జట్టప్ప, సలువాది.సురేంద్ర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీ వాగు వరద వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

## పంట నష్టపోయిన గ్రామాల్లో సిపిఎం పార్టీ బృందం పంటల పరిశీలన

## రైతులను ఆదుకోవాలని జెసికి వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు



దేవనకొండ , ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : ఆలూరు, పత్తికొండ నియోజకవర్గ లలో పై ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు హంద్రీ వాగు పొంగిపొర్లిన నేపథ్యంలో హంద్రీ వాగు కు ఇరువైపులా ఉన్నటు వంటి పంట పొలాలకు తీవ్ర నష్టం జరిగిందని హంద్రీ పరివాహక ప్రాంతంలో రైతులకు భారీగా నష్టం జరిగిందని నష్టపోయిన రైతన్నకి ఎకరాకు 50 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం నాడు సిపిఎం పార్టీ మండల కమిటీ బృందం నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ హంద్రీ వాగు వరద వలన పొలాలలో దాదాపుగా అడుగు నుండి నాలుగు అడుగుల మేర నీటి ప్రవాహం ప్రవహించిందని ఈ ప్రవాహం వలన పంట పొలాలలో విపరీతంగా బురద, మేట పెట్టడం వలన పంటలు చాలా తీవ్రంగా దెబ్బతిన్నాయి ఇప్పటికీ కొన్ని పంటలలో నీరు నిలిచి ఉందని ఈ పంటలు కుళ్ళిపోయేటువంటి ప్రమాదం ఉందని పత్తి మొదటి కాపు బాగా వచ్చిందని కాయలు, పూత బాగా ఉందని ఆనందపడిన రైతుకు వరద నిరాశ మిగిల్చిందని పేర్కొన్నారు.

భారీగా పెట్టుబడులు పెట్టి ఆశాజనకంగా వ్యవసాయం చేసిన రైతులకు అనుకోని రీతిలో హంద్రీ వాగు ప్రవాహం తీవ్ర కష్టాలను తెచ్చిపెట్టింది దాదాపుగా మద్దికేర మండలం బురుజుల గ్రామం నుండి తెర్నేకల్ వరకు దేవనకొండ మండలంలో వెలమకూరు, కుంకనూరు, పొట్లపాడు ,తెర్నేకల్ రెవిన్యూ పరిధిలో తీవ్ర పంట నష్టం జరిగింది రైతులు వేసుకున్న కంది, పత్తి ,ఉల్లి ,మిరప, వేరుశనగ, సజ్జ, జొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి ఈ నేపథ్యంలో దెబ్బతిన్న పంటను అంచనా వేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం పెరుగుతున్న పెట్టుబడులతో అతివృష్టి అనావృష్టితో నిత్యం పంట నష్టాన్ని చవిచూస్తున్న రైతన్న నీ ఆదుకోవాలని ఎకరాకు 50 వేల పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు బజారి మండల కమిటీ సభ్యులు మహబూబ్ బాషా యూసుఫ్ బాషా, ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, రవి ,బడే సాబ్ నాగేష్ ఆంజనేయులు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు .

# రక్తదానం ఆవశ్యకతపై అవగాహన సదస్సు



పొన్నూరు, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : రెడ్ క్రాస్ సొసైటీ మరియు రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో పిబిఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ టీం నేతృత్వంలో పిబిఎన్ కళాశాల నందు రక్తదానం, ప్రాణాపాయ పరిస్థితిలలో సి పి ఆర్ గురించి అవగాహన సదస్సు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమము నందు గుంటూరు రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ షేక్ జానీ రసూల్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణ రక్షణ కల్పించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని విద్యార్థులను అవగాహన కల్పించారు. రక్తదానం అన్ని దానాలకన్న గొప్పదని రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని చేయటం ద్వారా ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా ఊపిరాడని పరిస్థితులలో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులను ఏ విధంగా సిపిఆర్ చేయడం ద్వారా తిరిగి కోరుకునే విధంగా చేయవచ్చని దానిపై ప్రత్యక్షముగా చేసి అవగాహన కల్పించారు. తద్వారా విద్యార్థులు తమ చుట్టు ప్రక్కల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఏ విధంగా కాపాడవచ్చు అనే దానిపై అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవి రాకేష్ దేవ్ ,ఎన్ . బాలకృష్ణ, రోటరీ క్లబ్ సభ్యులు స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పిబిఎన్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోధనోపకరణాలను వినియోగించాలి: ఎంఈఓ బి సుధాకర్



అద్దంకి, ఆగస్టు 22, జర్నలిస్ట్ ఫైల్ : బుధ వారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాల యంలో ఒక్కరోజు ఒరియంటేషన్ శిక్షణా తరగతులు నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల విద్యాశాఖధికారి సుధాకర్ మాట్లాడుతూ తరగతి గదిలో ప్రతి ఉపాధ్యా యులు బోధన ఉపకరణాలను వినియోగిం చాలి అన్నారు నేటి నుండి కేటాయించిన ఉపాధ్యాయులు తరగతి బోధన పరిశీలన వారా నికి రెండు చొప్పున నెలకు 8 పూర్తి చేసి యాప్ లో నమోదు చేయాలన్నారు.

మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపా ధ్యాయులు ఈ కార్యక్రమానికి సహకరించాలన్నారు ఏవైనా టెక్నికల్ సమస్యలు ఉంటే మాస్టర్ నైపుణ్యం గల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వ రావు ఉపాధ్యాయులు మల్లికార్జున రావు ధనలక్ష్మి సలహాలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమం లో మండల విద్యా శాఖధికారి గంగాధరరావు 28 మంది బోధన పరిశీలకులు పాల్గొన్నారు.

# జన్‌పోషణ్ కేంద్రాలుగా రేషన్ షాపులు!



## ప్రయోగాత్మకంగా నాలుగు రాష్ట్రాల్లో 60 షాపులు ఎంపిక

## పనితీరు ఆధారంగా దేశవ్యాప్తంగా అమలు యోచనలో కేంద్రం

**న్యూఢిల్లీ, జర్నలిస్ట్ ఫైల్:** ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న రేషన్ దుకాణాలను ఇకపై అన్ని ఉత్పత్తుల పంపిణీకేంద్రాలుగా నిర్వహించేందుకు కేంద్ర ఆహార ప్రజాపంపిణీశాఖ కసరత్తులుచేస్తోంది. ఇందుకు సంబంధించి వీటన్నింటినీ ఇకపై జన్‌పోషక్ కేంద్రాలుగా మార్చి గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5.38 లక్షల వరకూ చౌకధరల దుకాణాలున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా ముందు నాలుగు రాష్ట్రాల్లో 60 దుకాణాలను ఎంపికచేసింది. అవి ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో 15, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 15, రాజస్థాన్‌లోని జైపూర్‌లో 15, తెలంగాణలోని హైదరాబాద్‌లో 15 కేంద్రాలను జన్‌పోషక్ కేంద్రాలుగా మార్చేందుకు నిర్ణయించింది. సబ్సిడీతో కూడిన ఆహార ఉత్పత్తులను ఈ కేంద్రాల ద్వారానే అందించేందుకు నిర్ణఇంచింది. ఆధునీకరించిన షాపులు ఇకపై చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు,డెయిరీ ఉత్పత్తులు, నిత్యావసరాలుకూడా వీటిద్వారానే విక్రయించే పథకాన్ని షురూచేస్తోంది.

ఇదే అమలుకు వస్తే రేషన్ డీలర్లకు కమిషన్ రూపంలో కూడా కొంతమేర వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటికే డీలర్లు తమకు కమిషన్‌ను పెంచాలని పదేపదే డిమాండ్‌చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో ప్రజాపంపిణీ దుకాణాలు కేవలం ఎనిమిది తొమ్మిదిరోజులు మాత్రమే తెరుచుకుంటున్నాయని, మరికొన్ని అయితే ప్రతి మూడునెలలకోసారి మాత్రమే తెరుస్తున్నారని, మిగిలిన సమయాల్లో ఈ షాపులు మూసివేసి ఉంచుతున్నారని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నారు. పైలట్‌ప్రాజెక్టుగా నాలుగు రాష్ట్రాల్లో ఈపథకాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. అంతేకాకుండా ఇందుకోసం మేరా రేషన్ యాప్‌ను కూడా అప్‌గ్రేడ్ చేసిన వెర్షన్‌ను జోషి ప్రారంభించారు. వీటితోపాటే ఎఫ్‌సిఐతో ఉన్న కాంట్రాక్టు నియమావళి, రేషన్‌షాపులవరంగా ఆహార ఉత్పత్తుల నాణ్యత నియమావళి చేతి పుస్తకాలను కూడా ఆవిష్కరించారు. ఆహారమంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజీవ్‌చోప్రా మాట్లాడుతూ రేషన్ డీలర్లకు సిబ్సిడిద్వారా సులభరీతిన రుణాలు అందించే ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే వృత్తినైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో డీలర్లకు వ్యవస్థ నిర్వహణల్లో సామర్థ్యం కూడా పెంచుతున్నట్లు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల్లో పైలట్ పథకం విజయవంతం అయితే ఈ మొత్తం పథకాన్ని దేశవ్యాప్తంగా నిరంతరాయంగా అమలుచేయాలనిచూస్తున్నట్లు ఆహార మంత్రిత్వశాఖప్రకటించింది. అలాగే అఖిలభారత రేషన్‌షాప్ డీలర్ల సమాఖ్య ఈ కార్యాచరణను స్వాగతించింది. తమకు ఇదొక పెద్ద ఉపశమనం అని గిట్టుబాటు కాక సతమతం అవుతున్న రేషన్ డీలర్లకు ఈ నిర్ణయం ఎంతో మేలుచేస్తుందని వెల్లడించింది. సీనియర్ ఎఫ్‌సిఐ అధికారులు, రాష్ట్ర ఆహారశాఖ కార్యదర్శులు, ప్రపంచ ఆహారపథకం నిపుణులు, ప్రతినిధులు ఈ ప్రారంభ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఈ బీ2బీ ప్లాట్‌ఫామ్ ఉడాన్ వినియోగ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ప్రజాపంపిణీ వ్యవస్థ, ఆహార మంత్రిత్వశాఖ; చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు సిడ్బీలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుని ఎఫ్‌పిఎస్ డీలర్లద్వారా ఆహార ఉత్పత్తుల విక్రయాలకు బీజం వేసినట్లు ప్రకటించింది. జన్‌పోషన్ కేంద్రాలను ఆధునీకరించడం ద్వారా వాటిని విభిన్న రకాల కొత్త ఉత్పత్తులను కూడా విక్రయించే కేంద్రాలుగా మార్చనున్నట్లు తెలిపింది. ప్రతి భారతీయుడికి కూడా నాణ్యతతో కూడిన సేవలు, ఉత్పత్తులు అందించడమే తమ లక్ష్యం అని ఉడాన్ సహ వ్యవస్థాపకుడు సిఇఒ వైభవ్ గుప్తా చెప్పారు.

ప్రస్తుతంప్రారంభించిన 60 కేంద్రాల్లో 3500 ఉత్పత్తులు అందుబాటులోకితెచ్చామని అన్నారు. ఎఫ్‌ఎంసిజి కేటగిరీలోని అన్ని ఉత్పత్తులను జన్‌పోషన్ కేంద్రాల్లో అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.



# ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోళ్లకు భారత్ డీల్!

## రక్షణమంత్రి రాజ్‌నాథ్ నాలుగురోజుల అమెరికా పర్యటన

**న్యూఢిల్లీ, జర్నలిస్ట్‌ఫైల్:** రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అమెరికాలో నాలుగురోజులుపాటు పర్యటించనున్నారు. శుక్రవారంనుంచి ఈ నాలుగురోజుల పర్యటన కొనసాగుతుంది. రక్షణరంగ భాగస్వామ్యం, పరస్పరసహకారం వంటి అంశాలపై అక్కడి రక్షణ మంత్రి ల్లాయిడ్ ఆస్టిన్, జాతీయ భద్రతా సలహాదారు జాక్ సల్లివాన్‌తదితరులతో చర్చలుజరుపుతారు. ఈచర్చల్లో భాగంగానే 31 ఎంక్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్ల కొనుగోలుకు కూడా ప్రణాళికఉంది. స్ట్రైకర్ ఇన్‌ఫ్రాంట్రీ కంబాట్ వాహనాలు, సంయుక్త భాగస్వామ్యంలో ఉత్పత్తి చేసేందుకు అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని చూస్తున్నారు. జిఇఎఫ్414 ఇంజన్లను భారత్ ఇప్పటికే కొనుగోలుచేస్తోంది. అంతేకాకుండా రాజ్‌నాథ్ చర్చలన్నీ కూడా ప్రత్యేకించి అక్కడి రక్షణమంత్రి ఆస్టిన్‌తోనే ఉంటాయని అజెండా ఖరారుచేసారు. భారత్ అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింతగా పటిష్టం అయ్యేందుకు వీలుగా ఈ పర్యటన జరుగుతుందని రక్షణ మంత్రిత్వశాఖ వెల్లడించింది.

భారత్ అమెరికా సంబంధాలు, రక్షణరంగంలో ఒప్పందాలు మరింతపెరుగుతున్న తరుణంలో ఈ పర్యటన మరింతప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే అమెరికా రక్షణరంగ పారిశ్రామికవేత్తలతోకూడా సుదీర్ఘచర్చలుజరుపుతారు. ప్రస్తుతం కొనసాగుతున్న భవిష్యత్తు రక్షణరంగ ఒప్పందాలపై ఈ అజెండా కొనసాగుతుంది. అలాగే భారతసంతతి ప్రజానీకంతోకూడా ముఖాముఖి నిర్వహిస్తారు.



# గగనతలంలో యుద్ధ విమానం నుంచి జారిపడ్డ సామగ్రి..

**న్యూఢిల్లీ, జర్నలిస్ట్‌ఫైల్:** భారత వైమానిక దళానికి చెందిన యుద్ధవిమానం గగనతలంలో ఉండగా అనుకోని పరిస్థితి ఎదురైంది. అందులో నుంచి సామగ్రి జారిపడిందని ఐఎఎఫ్ వెల్లడించింది. సాంకేతిక లోపమే ఇందుకు కారణమని తెలిపింది. బుధవారం రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లాలో పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సామగ్రి జారిపడిన ప్రదేశం నిర్మానుష్యంగా ఉండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని పేర్కొంది. దీనిపై ఐఎఎఫ్ విచారణకు ఆదేశించింది. అయితే పడిపోయిన ఆ సామగ్రి ఏంటో మాత్రం వెల్లడించలేదు. ఎయిర్ స్టోర్ పడినప్పుడు పెద్ద శబ్దం వినిపించడంతో ఏం జరిగిందో తెలుసుకునేందుకు దగ్గర్లోని స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఒక వస్తువు ముక్కలు కనిపించినట్లు పోలీసులు తెలిపారు.

# 151 మందిఎంపిలు, ఎమ్మెల్యేలపై లైంగికహింస కేసులు



## సంచలనం కలిగించిన ఎడిఆర్ నివేదిక

**న్యూఢిల్లీ, జర్నలిస్ట్ ఫైల్:** పార్లమెంటులో సుమారు 151 మందికిపైగా సిట్టింగ్ ఎంపిలు, అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేలపై మహిళలపై నేరాల కేసులు నమోదయినట్లు తేలింది. వీరంతా తమతమ ఎన్నికల అఫిడవిట్లలో ఈ అంశాలనుసైతం వెల్లడించారు. వీటిలో పశ్చిమబెంగాల్‌లోనే ఎక్కువ సంఖ్యలో ప్రజాప్రతినిధులు మహిళలపై నేరాలకు పాల్పడినట్లు కేసుల్లో ఉన్నారు. ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (ఎడిఆర్) మొత్తం 4693 అఫిడవిట్లను పరిశీలించింది. వీరంతా సిట్టింగ్ ఎంపిలు, ఎమ్మెల్యేలే కావడం గమనార్హం. 2019 నుంచి 2024మధ్యకాలంలో జరిగిన ఎన్నికల్లో దాఖలుచేసిన అఫిడవిట్లు ఇందుకు దోహదంచేస్తున్నాయి. సంస్థ మొత్తం 16 మంది ఎంపిలు, 135 మంది ఎమ్మెల్యేలు మహిళలపై నేరాలకు పాల్పడినట్లు నమోదయిన కేసుల్లో నిందితులుగా ఉండటం గమనార్హం. బెంగాల్‌లో అయితే 25 మంది సిట్టింగ్ ఎంపిలు, ఎమ్మెల్యేలు ఇలాంటి అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 21 మందిపైనా, ఒడిశాలో 17 మంది ప్రజాప్రతినిధులపైనా ఈకేసులు నమోద య్యాయి. కోల్‌కత్తా ఆర్జీకార్ ఆసుపత్రి వైద్యురాలిపై హత్యాచారం సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించడంతో ఈ వివరాలను ఎడిఆర్ వెలికితీసింది.

అలాగే థాణెలో కూడా ఇద్దరు నాలుగేళ్ల చిన్నారులపై స్కూలు టాయిలెట్ క్లీనర్ అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన కూడా బాద్లాపూర్ మెట్రో స్టేషన్‌లో విధ్వంసానికి దారితీసింది. ఐపిసి సెక్షన్ 376 కింద నమోదయిన కేసులు 16 మంది సిట్టింగ్ ఎంపిలు,ఎమ్మెల్యేలపై ఉన్నాయి. ఈ కేసులప్రకారం నేరం రుజువు అయితే కనీసం పదేళ్లపాటు జైలుశిక్ష పడుతుంది. ఈమొత్తం సంఖ్యలో ఇద్దరు ఎంపిలుంటే 14 మంది ఎమ్మెల్యేలున్నారు. ఒకే బాధితురాలిపై పదేపదే వేధించిన సంఘటనలపైనా కేసులున్నాయి. ఇక రాజకీయ పార్టీలవరంగాచూస్తే భారతీయ జనతాపార్టీకి చెందినప్రజాప్రతినిధులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

54 మంది ఎంపిలు ఎమ్మెల్యేలపై ఈ కేసులున్నాయి. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీపరంగా 23 మందిపై ఉంటే తెలుగుదేశం పార్టీపరంగా 17 మంది ప్రజాప్రతినిధులపై ఈకేసులున్నాయని ఎడిఆర్ నివేదిక వెల్లడించింది. ఇక బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రెండు కూడా ఐదుగురు చొప్పున సిట్టింగ్‌ప్రజాప్రతినిధులపై అత్యాచారం కేసులున్నాయి. ఇటువంటి నాయకులకు రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వకుండా కఠిన నిబంధనలు అమలుచేయాలని ప్రత్యేకించి మహిళలపై అత్యాచారాలు, ఇతర నేరాలకు పాల్పడిన వారికి టికెట్లు నిరాకరించాలని సిఫారసులుచేసింది. అంతేకాకుండా ఎంపి ఎమ్మెల్యేలపై ఈకేసులు విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు కూడా ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేసింది. అలాగే ఓటర్లు కూడా ఇలాంటినేరాలు కేసులు ఉన్న నాయకులకు ఓట్లు వేయకుండాచైతన్యంతో వ్యవహరించాలని కూడావిజ్ఞప్తిచేసింది.

# షేక్ హసీనాను అప్పగించండి..



## భారత్‌కు బంగ్లా డిమాండ్

**ఢాకా, జర్నలిస్ట్ ఫైల్ :** రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్‌ను నిప్పుల కుంపటిగా మార్చడంతో ప్రధాని పదవి నుంచి దిగిపోయి ఆ దేశాన్ని వీడారు షేక్‌హసీనా. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెపై బంగ్లాలో హత్య అభియోగాలు సహా పలు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే ఆమెను తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ న్యూఢిల్లీని డిమాండ్ చేసింది. 'మన పొరుగు దేశం ఆమెకు ఆశ్రయం కల్పించడం విచారకరం. అక్కడి నుంచి ఆమె బంగ్లా విజయాన్ని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. హసీనాను మీరు న్యాయబద్ధంగా బంగ్లాదేశ్‌కు అప్పగించాలి. పలు అభియోగాల్లో ఆమెను విచారించేందుకు మా దేశ ప్రజలు, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమెను విచారణ ఎదుర్కోనివ్వండి అని బిఎన్‌పి పార్టీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫక్రుల్ ఇస్లామ్ ఆలంగిర్ పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందలమంది ప్రాణాలు కోల్పోయారు.

ఈ క్రమంలో మృతుల కుటుంబాలు పోలీసులను ఆశ్రయించాయి. వారి కుటుంబసభ్యుల మరణాలకు హసీనానే కారణమని ఆరోపిస్తూ ఫిర్యాదులు చేశాయి. దీంతో మాజీ ప్రధాని, ఆమె అనుచరులపై పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు హసీనాపై 31 కేసులు నమోదయ్యాయి. ఇందులో 26 హత్య అభియోగాలపైనే నమోదవడం గమనార్హం. మారణహోమానికి కారకులయ్యారనే ఆరోపణలపై నాలుగు కేసులు కిడ్నాప్‌కు సంబంధించి మరో కేసు నమోదైంది. ఆమెతో పాటు హసీనా కుమారుడు సాజిద్ వాజెద్ జాయ్, కుమార్తె సైమా వాజెద్, సోదరి షేక్ రెహానాను కూడా ఈ హత్య కేసుల్లో సహ నిందితులుగా పేర్కొన్నట్లు బంగ్లా పోలీసులు వెల్లడించారు. హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది.

# ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళ బ్రన్యాస్ కన్నుమూత



**వాషింగ్టన్, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా భావిస్తున్నమరియా బ్రన్యాస్ 117 ఏళ్ల వయసులో కన్నుమూశారు. అమెరికాలో జన్మించిన స్పెయిన్ దేశస్థురాలైన బ్రన్యాస్ తాను కోరుకున్నట్లే ఎలాంటి బాధ లేకుండా నిద్రలోనే మరణించారు. ఆమె కుటుంబసభ్యులు ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. గతేడాది ఫ్రాన్స్‌కు చెందిన లూసిల్ రాండన్ (118) మరణించిన అనంతరం వయోవృద్ధుల అధ్యయన బృందం బ్రన్యాస్‌ను ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ప్రకటించింది. బ్రన్యాస్ తరువాతి స్థానంలో జపాన్‌కు చెందిన టొమికో ఇతోకా (116) ఉన్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో 1907 మార్చి 4న బ్రన్యాస్ మరియా జన్మించారు. 113 ఏళ్ల వయసులో ఆమె కరోనా నుంచి కోలుకున్నారు.

# కమలా హారిస్ కోసం యుఎస్ సిద్ధంగా ఉంది..



## అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా

**వాషింగ్టన్, జర్నలిస్ట్ ఫైల్ :** కమలాహారిస్ కోసం యుఎస్ సిద్ధంగా ఉంది. అధ్యక్ష విధులు నిర్వర్తించడానికి కమల సిద్ధంగా ఉన్నారంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆమెకు మద్దతు పలికారు. ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన వ్యక్తిని ఎన్నుకునే అవకాశం వచ్చిందని, ఆమె అమెరికాకు కాబోయే అధ్యక్షురాలని ధీమా వ్యక్తంచేశారు. ఒక అత్యున్నతమైన అధ్యక్షుడిగా జో బైడెన్ చరిత్రలో నిలిచిపోతారని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. షికాగోలో జరుగుతున్న డెమోక్రటిక్ పార్టీ జాతీయ సదస్సులో భాగంగా ఒబామా మాట్లాడారు. ఆయన సతీమణి మిషెల్ ఒబామా కూడా హారిస్‌కు మద్దతు పలికారు. ఈ సరికొత్త ఆర్థిక వ్యవస్థలో కోట్లాదిమంది ప్రజల అవసరాలను గుర్తించే లీడర్ కావాలి. కమల అలాంటి ప్రెసిడెంట్‌గా ఉంటారు. ఆమె చేయగలరు. ఈ అధ్యక్ష ఎన్నికల పోరు హోరాహోరీగా ఉండనుంది.

అమెరికాలో గృహతనఖా సంక్షోభం తర్వాత ఇంటి యజమానులకు న్యాయపరమైన పరిష్కారం కోసం అప్పుడు అధికారంలో ఉన్న మా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. చిన్నపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడేవారికి వ్యతిరేకంగా పోరాడారు. ఆమె మీ సమస్యలపై దృష్టిసారిస్తారు. తనసొంతఓటర్ల గురించి మాత్రమే కాకుండా తననువ్యతిరేకించేవారి సమస్యలను తీర్చుతారు. అలాగే ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాల్జ్ రాజకీయాల్లో ఉండాల్సిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ప్రసంగం డెమొక్రాట్లను ఉత్సాహపరిచింది. కమల, నేను ఒకే విలువలపై మా జీవితాలను నిర్మించుకున్నాం. కమల తల్లి 19 ఏళ్ల వయసులో భారత్ నుంచి అమెరికాకు వచ్చారు. తన బిడ్డకు న్యాయం గురించి నేర్పారు. కూర్చొని ఫిర్యాదు చేయవద్దు. ఏదైనా చేయమని సలహా ఇచ్చారు. ఆ మాటలతోనే హారిస్ ఎంతో కష్టించారు.

ఆమె తన సొంత సమస్యల గురించి కాకుండా ప్రజల ఆందోళనలపై దృష్టిసారిస్తారని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ విభజన రాజకీయాలను ఒబామా ఖండించారు. అదంతా పాతతరం రాజకీయం అని విమర్శించారు. అమెరికాకు మరో నాలుగేళ్ల గందరగోళం అవసరం లేదన్నారు. ట్రంప్ ప్రజలను భయపెట్టేలా ప్రతిదీ చేశారని మిషెల్ ఒబాబా తీవ్రంగా మండిపడ్డారు. ఆయన స్త్రీద్వేషి అని, జాతి వివక్షను రెచ్చగొట్టేలా అబద్ధాలు వ్యాప్తి చేస్తారని విమర్శించారు.

# బద్లాపూర్ నిరసనలు రాజకీయ ప్రేరేపితం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే

**ముంబయి, జర్నలిస్ట్ ఫైల్ :** బద్లాపూర్‌లోని పాఠశాలలో మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులపై టాయిలెట్‌లో ఓ స్వీపర్ లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. నిందితుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు బద్లాపూర్ రైల్వేస్టేషన్‌లలో పెద్ద ఎత్తున నిరసనలు చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఈ ఆందోళనలు రాజకీయ ప్రేరేపితమైనవని విమర్శించారు. పాఠశాలలో జరిగిన ఘటనను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. నిరసనలో పాల్గొన్నవారు స్థానికులు కాదు. రాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ వారి డిమాండ్లు అంగీకరించారు. నిరసనలో కొందరు ప్రభుత్వం చేపట్టిన లడ్కీ బహిన్ యోజన ప్లకార్డులు పట్టుకున్నారు అని తెలిపారు. ఇక బద్లాపూర్ రైల్వేస్టేషన్‌లో పరిస్థితులు అదుపులోకి వచ్చాయని సెంట్రల్ రైల్వే జీఆర్పీ డీసిపి మనోజ్ పాటిల్ పేర్కొన్నారు. రైళ్ల రాకపోకలు సాధారణంగా కొనసాగుతున్నాయన్నారు. వదంతులు వ్యాపించకుండా కొన్ని రోజులు ఇంటర్నెట్



సేవలు నిలిపివేశామన్నారు. రైల్వే స్టేషన్‌లో పోలీసు బలగాలను మోహరించామని వెల్లడించారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో జరిగిన ఘటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. శాంతి భద్రతలు కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఎన్సీపి ఎంపి సుప్రియా సూలే, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో సహా పలువురు ప్రతిపక్ష నాయకులు విమర్శించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్రఫడ్నవీస్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# రైల్వేట్రాక్ పక్క ఇడి అధికారి మృతదేహం

## అవమాన భారంతో అలోక్‌రంజన్ ఆత్మహత్య

**న్యూఢిల్లీ, జర్నలిస్ట్ ఫైల్ :** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు చెందిన అధికారి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఢిల్లీలో సాహిబాబాద్‌లోని రైల్వే ట్రాక్ పక్కన ఆయన మృతదేహం లభ్యమైంది. అధికారిపేరు అలోక్‌రంజన్ అని పోలీసులు వెల్లడించారు. అలోక్‌రంజన్‌ది ఘజియాబాద్. డిప్యుటేషన్‌పై ఇడిలో పనిచేస్తున్నారు. అంతకుముందు ఆయన ఆదాయపు పన్ను విభాగంలో విధులు నిర్వర్తించారు. ఇటీవల ఒక అవినీతి కేసులో సిబిఐ ఆయన్ను రెండుసార్లు విచారించింది. అయితే నేరం చేసినట్లు ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఆయన్ను వదిలేసారు. లంచం తీసుకున్న కేసుల్లో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్‌సింగ్‌ను సిబిఐ అరెస్టుచేసిన క్రమంలో అలోక్‌పేరు వెలుగులోకి వచ్చింది. రూ.20 లక్షలు లంచం తీసుకుంటుండగా సింగ్‌సిబిఐ చేతికి చిక్కారు. ఈ కేసులోనే అలోక్‌పేరు వినిపించింది. ఎఫ్ఐఆర్‌లోనూ ఆయన పేరుచేర్చారు. ఈక్రమంలోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది.

# బద్లాపూర్ రేపిస్టు ఇక తప్పించుకోలేడు..



## పిపిగా న్యాయవాది ఉజ్వల్ నికమ్!

**ముంబయి,జర్నలిస్ట్‌ఫైల్:** మూడు, నాలుగేళ్ల ఇద్దరు బాలికలపై పాఠశాల టాయిలెట్‌లో ఒక స్వీపర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన మహారాష్ట్రలో తీవ్ర ప్రజాగ్రహానికి దారితీసింది. ఆందోళనలతో బద్లాపూర్ ప్రాంతం స్తంభించింది. ఈ కేసు విచారణకు ప్రముఖ సీనియర్ న్యాయవాది, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఉజ్వల్ నికమ్‌ను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నియమించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్నో కేసుల్ని వాదించిన అనుభవం ఆయన సొంతం. ఇటీవల లోక్‌సభ ఎన్నికల వేళ ఉజ్వల్ నికమ్ పేరు వినిపించింది. ముంబయి నార్త్ సెంట్రల్ స్థానంలో వరుసగా రెండుసార్లు గెలిచిన సిట్టింగ్ ఎంపి పూనమ్ మహాజన్‌ను ఈ సారి పక్కనపెట్టి ఉజ్వల్‌కు బిజెపి టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు వర్ష ఏక్‌నాథ్ గైక్వాడ్‌పై పోటీపడి, ఓటమి చవిచూశారు. ఇదిలా ఉంటే 1993 ముంబయి సీరియల్ బాంబు పేలుళ్ల, టి సిరీస్ మ్యూజిక్ సంస్థ అధినేత గుల్షన్ కుమార్ హత్య కేసు, 2008 ముంబయి దాడులకేసుల్లో నిందితులను కటకటాల్లోకి పంపడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయిన ఉజ్వల్ నికమ్ అలుపెరగకుండా శ్రమించారు.

ఇదిలా ఉండగా ఇద్దరు బాలికలు మూత్ర విసర్జనకు వెళ్లిన సమయంలో టాయిలెట్‌ను శుభ్రంచేసే వంకతో వారి వద్దకు వెళ్లి స్వీపర్ ఈ నిర్వాకానికి ఒడిగట్టాడు. అంతర్గత అవయవాల వద్ద నొప్పిగా ఉందని ఒకబాలిక తన తల్లిదండ్రులతో చెప్పడంతో విషయం వెలుగులోకివచ్చింది. పాఠశాలకువెళ్లడానికి భయ పడిపోతున్న మరో బాలికను వైద్యుల వద్దకు తీసుకెళ్లినపుడు ఆ చిన్నారిపైనా ఇలాంటి దుశ్చర్య జరిగినట్లు తేలింది. ఈ కేసు నమోదు చేసే విషయంలో తొలుత పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వార్తలు రావడం తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. అలాగే పాఠశాల యాజమాన్యం కూడా ఈ ఘటన బయటకు రాకుండా చూడాలని ప్రయత్నించిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# కత్తెర కోసం 36 విమాన సర్వీసులు రద్దు

## న్యూచిటోస్ ఎయిర్‌పోర్టులో అధికారుల తనిఖీలు



**టోక్యో,జర్నలిస్ట్ ఫైల్:** వాతావరణం అనుకూలించక పోవడం లేదా భద్రతాపరమైన అంశాలపై విమానసర్వీసులు రద్దుకావడం లేదా జాప్యం కావడంచూస్తాం. కానీ జపాన్‌లోని అత్యంత రద్దీగా ఉండే న్యూచిటోస్ ఎయిర్‌పోర్టులో ఇటీవల వందల సంఖ్యలో విమానసర్వీసులకు ఆటంకం ఏర్పడింది. ఒక కత్తెర కనిపించక పోవడమే ఈ జాప్యానికి కారణమని తెలుసుకుని ప్యాసింజర్లు అవాక్కయ్యారు. హక్కైడో ద్వీపంలోని న్యూచిటోస్ ఎయిర్‌పోర్టులో గత శనివారం రిటైల్ స్టోర్‌నుంచి ఒక కత్తెర కనిపించకుండా పోయింది. విమానాశ్రయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు ముమ్మం తనిఖీలుచేసారు. ఎయిర్‌పోర్టుకువచ్చే ప్రయాణీకుల భద్రతా తనిఖీలను ఆపి మరీ దాదాపు రెండు గంటలపాటు దానికోసం క్షుణ్ణంగా వెతికారు. దీని కారణంగా 36 విమానసర్వీసులను రద్దుచేయాల్సి వచ్చింది. మరో 201 విమానసర్వీసులు ఆలస్యమయ్యాయి. దీనిపై అధికారులు విచిత్రమైన వివరణ ఇచ్చారు. ఎవరైనా ఉగ్రవాది కత్తెరను దొంగిలించి దాన్ని ఆయుధంగాచేసుకునే ప్రమాదం ఉంది. అందుకే ఈ సోదాలుచేసామని అధికారులు చెప్పారు. మరో ట్విస్ట్ ఏంటంటే కనిపించకుండాపోయిన ఆ కత్తెర అదే దుకాణంలో దొరికింది. ఆస్టోర్‌లో మేనేజ్‌మెంట్ వ్యవస్థ సరైనదిగా లేకపోవడంతో ఈసంఘటన జరిగిందని విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఈఘటనపై దర్యాప్తు చేయాలని జపాన్ రవాణా మంత్రిత్వశాఖ ఎయిర్‌పోర్టు అధికారులను ఆదేశించింది.

## కోనసీమ జిల్లాలో నేడు చంద్రబాబు పర్యటన..



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బాబు బయల్దేరతారు. 11.40కి కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 11.50కి వానపల్లిలోని పళ్ళాలమ్మ గుడి వద్దకు వస్తారు. 11.50 నుంచి 1.30 వరకు గ్రామసభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు.
2 గంటల నుంచి 2.20 వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో భేటీ అవుతారు. 2.20కి వానపల్లి గ్రామం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.35 గంటలకు రాజమండ్రి ఎయిర్ పోర్టుకి చేరుకుంటారు. మధ్యాహ్నం 2.45కు ప్రత్యేక విమానంలో బయలుదేరి 3.35 గంటలకు తెలంగాణ రాష్ట్రం బేగంపేట ఎయిర్ పోర్టుకి వెళ్తారు. అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటలకల్లా జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకుంటారు.

## పెదనందిపాడు బస్టాండ్ సమస్యలపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు జిల్లా ప్రతిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు మండల గ్రామంలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ సమస్యలపై గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులకు వినతిపత్రం అందించారు.
వినతిపత్రంలో, బస్టాండ్ వద్ద బస్సులు లోపలికి రావడం లేదని, పెదనందిపాడు ఆర్ట్స్ %ఒ% సైన్స్ కళాశాల మరియు జడ్పీ పాఠశాలలోని వాన నీరు గ్రామంలోని మురికి నీరు కిందకి వెళ్లకుండా తూములు అడ్డంగా నిలిచాయని, దీంతో బస్టాండ్‌కు మహిళలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.
**ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పందన:**
ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ, బస్టాండ్‌కు బస్సులు సౌకర్యవంతంగా వచ్చేలా మరియు మురికి నీరు కిందకు వెళ్లేలా సమస్యను పరిశీలించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య, వెలిలేని శివయ్య, నూతి శ్రీనివాసరావు, చాగంటి సత్యహర్ష, ప్రసాదు, వెంకటేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ తమ్మినేని నకిలీ సర్టిఫికేట్లపై సిఐడి దర్యాప్తు ... ఎమ్మెల్యే రవికుమార్ ఫిర్యాదు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణలోని మహాత్మాగాంధీ లా కళాశాలలో మూడేళ్ల లా చదివానని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం చూపించిన నకిలీ డిగ్రీ సర్టిఫికేట్ వ్యవహారంపై సిఐడి దర్యాప్తు చేయించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఈ మేరకు సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను గురువారం కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. తమ్మినేని నకిలీ సర్టిఫికేట్ వ్యవహారంపై 2022 నుంచి పోరాటం చేస్తున్నానని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేయాలని రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివి పాసైనట్లు తమ్మినేని సర్టిఫికేట్లు తయారుచేశారని ఆరోపించారు. తమ యూనివర్సిటీలో తమ్మినేని డిగ్రీ చేయలేదని ఆ వర్శిటీ రిజిస్ట్రార్ రాతపూర్వకంగా స్పష్టం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రపతి లేఖ, బిఆర్ఎయు ఓపెన్ యూనివర్సిటీ ఇచ్చిన వివరాలను పూర్తిగా పరిశీలించి సిఐడి విచారణకు ఆదేశించాలని, తమ్మినేనిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తూర్పు కాపు సాధికార కమిటీ కన్వీనర్ పల్లి సురేష్ ఉన్నారు.

## ఎస్వి అన్నప్రసాదం ట్రస్టుకు రూ కోటి విరాళం



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎస్వి అన్నప్రసాదం ట్రస్ట్‌కు గురువారం రూ. కోటి విరాళం అందింది. కాకినాడకు చెందిన ప్రసన్న కోట విరూపా పవర్ ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ. 1,00,01,116/- విరాళం అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును దాత తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు.

# రేపల్లె పై ఎందుకింత నిర్లక్ష్యం !?

**❍సౌకర్యాలు లేమితో రేపల్లె ఆర్టీసీ డిపో**
**❍దూర ప్రాంతానికి బస్సులు లేవు**
**❍జిల్లా కేంద్రానికి ఎక్స్ప్రెస్ లేదు!**




**రేపల్లె ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత రేపల్లె ఆర్టీసీ డిపో గుంటూరు నుండి బాపట్ల రీజియన్ కు మార్చబడి.. జిల్లా కేంద్రం గుంటూరు నుండి బాపట్ల కేంద్రంగా మారింది. ఏళ్ల తరబడి మారుమూల తీర ప్రాంతంలో ఉన్న రేపల్లె ఆర్టీసీ డిపో సౌకర్యాలు లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు ఈ డిపో నుండి భద్రాచలం, విశాఖపట్నం వంటి సుదూర ప్రాంతాలకు బస్సు ప్రయాణ అందుబాటులో ఉండేవి. పుణ్య తీర్థాలకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాలను వినియోగించుకునేవారు, పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణాజిల్లా మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక వాసులకు... అవనిగడ్డ, చల్లపల్లి డిపో నుండి మియాపూర్, రాయచూర్, విశాఖపట్నం, తిరుపతి, భద్రాచలం, శ్రీశైలం, నర్సాపురం సుదూర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించారు. కానీ ఇప్పటివరకు రేపల్లె డిపో నుండి సమీప మచిలీపట్నం, గుడివాడ, ఒంగోలు పట్టణాలకు గానీ, విశాఖపట్నం, తిరుపతి, భద్రాచలం, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు ఒక్కసర్వీస్ కూడా లేకపోవడం శోచనీయం.

అందుబాటులోకి వస్తున్న జాతీయ రహదారి ఉపయోగించుకొని కాకినాడ, ఒంగోలు, అలాగే తిరుపతి, విశాఖపట్నం సుదూర ప్రాంతాలకు ఒక్క సర్వీస్ కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఎక్కువగా ఆర్టీసీకి ఆదాయం సుదూర ప్రాంతాల నుండి లభిస్తుంది. రేపల్లె డిపో ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాలకు, పుణ్యక్షేత్రాలకు పండగలప్పుడు ఏర్పాటుచేసిన కూడా... డిపో పరిధిలోని బస్ స్టాప్ లో గ్రామాల్లో ఎక్కడ కూడా ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించకుండా ఆక్యుపెన్సీ రేషియో లేదని, ఆదాయం రావట్లేదు అని సాకుగా చూపి, ఎటువంటి సమాచారం లేకుండా సర్వీసులను నిలుపుదల చేయడం రేపల్లె డిపో అధికారులకే చెల్లుతుంది.
గత మాసంలో రేపల్లె డిపో మేనేజర్ పదవి విరమణ పొందిన దరిమిలా, తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇన్చార్జిగా నియమించారు, రేపల్లె డిపో మేనేజర్ లేకపోవడం వలన ప్రతి కార్యక్రమం తెనాలి డిపో నుండి నిర్వహించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. తీరప్రాంత డిపో అభివృద్ధికి కృషి చేసే సమర్థవంతమైన అధికారి అవసరం ఈ డిపోకు ఎంతో ఉంది.
ఏపీఎస్ఆర్టీసీ బస్సులలో జిల్లా కేంద్రం బాపట్ల చేరుకోవాలంటే 50 కిలోమీటర్ల దూరం సుమారు రెండు నుండి మూడు గంటల సమయం ఆర్డినరీ సర్వీస్ లో వెచ్చించాల్సిందే. నిత్యం రేపల్లె ప్రాంతం నుండి జిల్లా కేంద్రం బాపట్లకు ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఆర్డినరీ ప్యాసింజర్ బస్సులలో ప్రయాణం చేయాలంటే నరకప్రాయం ప్రయాణం.
జిల్లా కేంద్రం బాపట్ల ఏర్పడి రెండేళ్లు దాటినా నాన్ స్టాప్ సర్వీసులు, ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీసులు ఏర్పాటులో అధికారులు అలసత్వం చూపుతూ సర్వీస్లను కేటాయించకపోవడం నిర్లక్ష్యమే. రేపల్లె డిపో నుండి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఫాస్ట్ సర్వీస్ లేకపోవడం వలన ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనములను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి రేపల్లె డిపో నుండి బాపట్ల వంకు నాన్ స్టాప్ సర్వీసులు, ఎక్స్ ప్రెస్ సర్వీస్ ఏర్పాటు చేయాలని, దశాబ్దాల చరిత్ర ఉన్న తీర ప్రాంతమైన రేపల్లె డిపోను అభివృద్ధి చేసుకోవలసిన ఆవశ్యకత పాలకులకు ఎంతైనా ఉంది. సుదూర ప్రాంతాలకు పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు తీర ప్రాంత వాసులైన ప్రయాణికులకు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమం

**❍ధార్మిక సంస్థల ఆస్తుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు**
**❍జిల్లా కన్వీనర్ గా సయ్యద్ (బాబు భాయ్) అహ్మద్ బాషా,**



**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్)** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ 1995 సవరణలకు వ్యతిరేకంగా గురువారం స్థానిక రహమతియా ఫంక్షన్ ప్యాలెస్ యందు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సయ్యద్ అహ్మద్ భాష (బాబు భాయ్) అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.
ముస్లిం మైనారిటీల భాష, సాంస్కృతిక ,ఆర్థిక, విద్య ఉపాధి ,సామాజిక అభివృద్ధి భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ధార్మిక కార్యక్రమాల కోసం దూరదృష్టితో పూర్వికులు తమ ఆస్తులను వక్ఫ్ చేశారని ఈ భూములను రక్షించి మైనార్టీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న వక్ఫ్ చేయబడ్డాయో ఆ ఉద్దేశాన్ని పాలకులు విస్మరించారని గుర్తు చేశారు. వక్ఫ్ బోర్డు 'అపరిమిత అధికారాల'కు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుని తీసుకువచ్చిందన్నది అసంబద్ధం అయితే, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో, జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని కేంద్రం ఏర్పాటు చేసిందని. ఇదిలా ఉంటే ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ ఈ బిల్లుకు లోక్‌సభలో మద్దతు ప్రకటించింది. కాగా, క్షేత్రస్థాయిలో మాత్రం నితీష్ కుమార్‌కి చెందిన జేడీయూ పార్టీలో 'వక్ఫ్ బిల్లు' చీలికలు వచ్చినట్లు తెలుస్తోందని. ఈ బిల్లుపై జేడీయూ పార్టీ నేతలు రెండుగా చీలిపోయారని తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్తించి కోవాలన్నారు. దేశవ్యాప్తంగా 9 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్న వక్ఫ్ బోర్డు భూములను స్వాధీనం చేసుకొని ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా బీజేపీ ఈ బిల్లుని తీసుకువచ్చిందన్నారు. వక్ఫ్ భూముల్ని లాక్కోవడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని చెప్పారు అందులో భాగంగా 40 సవరణల తీసుకొచ్చి బడా కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు తహతహలాడుతుందన్నారు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డు ఆస్తులె కాకుండా భవిష్యత్తులో ఇతర ధార్మిక హిందూ, క్రిస్టియానిటీ సంస్థలకు చెందిన ఆస్తులను సైతం కైవసం చేసుకుంటారని ఆరోపించారు. మైనారిటికమ్యూనిటీలో ఈ బిల్లుపై భయాలు ఉన్నాయని, అయితే జేపీసీ పరిశీలనకు పంపాలన్న కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మైనారిటీలు చైతన్యవంతులు కావాలన్నారు.

## గ్రామ సభలను విజయవంతం చేయండి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో శుక్రవారం జరగనున్న గ్రామ సభల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించడం ద్వారా ప్రజలకు పలు అంశాలపై ప్రభుత్వం అవగాహన కల్పించనుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి గ్రామ సభల నుంచే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నదని తెలిపారు.
**రేపు గ్రీవెన్స్ రద్దు : అశోక్ బాబు**
టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన గ్రీవెన్స్ రద్దయింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు జరగనున్న నేపథ్యంలో ప్రజావేదిక కార్యక్రమం రద్దు అయిందని టిడిపి కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
**పలు ఫిర్యాదులు**
టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి గ్రీవెన్స్ నిర్వహించారు. పిజి కోర్సుల్లో చేరే రూరల్ ప్రాంత డాక్టర్ల రిజర్వేషన్‌ను 15 శాతానికి కుదించారని పలువురు డాక్టర్లు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు కళాశాలలను కూడా కుదించడంతో ప్రభుత్వ డాక్టర్లకు కూడా అన్యాయం జరుగుతోందని తెలిపారు. గతంలో ఉన్న రిజర్వేషన్‌ను కొనసాగించి తగిన వేతనం అందించాలని కోరారు. ఎపిశాట్స్ఆర్‌డి సంస్థలో పదేళ్లుగా డిఆర్‌పిలుగా పనిచేస్తున్న తమను తాత్కాలికంగా ఉద్యోగాల నుంచి తొలగించారని పలువురు తెలిపారు. విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు చెప్పినా తమను రానివ్వకుండా డైరెక్టరు జగదీష్ అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.

## టీటీడీ కీలక నిర్ణయం.. తిరుమలలో ప్రత్యేక దర్శనాలు రద్దు..



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం ప్రతిరోజు వేలాది మంది భక్తులు వెళ్తుంటారు. సర్వదర్శనంతో పాటు రూ. 300, బ్రేక్ దర్శనం అందుబాటులో ఉంటుంది. వీఐపీలు, వీవీఐపీల సిఫార్సు లేఖలపై ప్రత్యేక దర్శన సదుపాయం కల్పిస్తారు. అయితే అక్టోబర్‌లో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పది రోజుల పాటు అన్ని రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ అధికారులు ప్రకటించారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో జరిగే ఆర్జిత సేవలతో పాటు బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అక్టోబర్4వ తేదీ నుంచి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే టీటీడీ ఈవో వెంకయ్య చౌదరి అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మత్సవాల సందర్భంగా తిరుమలలో అధిక రద్దీ ఉంటుంది. భక్తులు సాధారణ రోజులకంటే రెట్టింపు సంఖ్యలో వస్తారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. అలాగే వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐలు, చిన్నపిల్లల తల్లిదండ్రులతో సహా అన్ని ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు ప్రకటించారు.
**సిఫార్సు లేఖలపై..**
శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి సిఫార్సు లేఖలను టీటీడీ అధికారులు స్వీకరించరు. పది రోజుల పాటు భక్తులంతా సర్వదర్శనం క్యూలైన్‌లోనే శ్రీవారిని దర్శనం చేసుకోవల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా వీవీఐపీలు స్వయంగా వస్తే మాత్రం వారికి ప్రోటోకాల్ ప్రకారం దర్శనం కల్పిస్తారు.
**బ్రహ్మోత్సవాలు ఇలా..** అక్టోబర్ 4న ధ్వజారోహణతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 8వ తేదీన గరుడసేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం నిర్వహిస్తారు. ధ్వజరోహణ సందర్భంగా ధ్వజస్తంభంపై గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మో త్సవాలకు ఆహ్వానిస్తారు. వేద పండితులు మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టీటీడీ అటవీశాఖ 2 వారాల ముందు నుంచే కసరత్తు చేస్తుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహన సేవలు ఉంటాయి.

## భారత్-ఇంగ్లండ్ 5 టెస్టుల సిరీస్ షెడ్యూల్ రిలీజ్




**స్పోర్ట్స్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ షెడ్యూల్‌ను బిసిసిఐ, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. వచ్చే ఏడాది జూన్ నుంచి ఆగస్ట్ మధ్య ఈ సిరీస్ జరగనుంది. ఇరు జట్ల మధ్య చివరిసారిగా ఇంగ్లండ్ దేశంలో 2021లో ఐదు టెస్టుల సిరీస్ జరిగింది. దీనిని 2-2తో సమంగా పంచుకున్నాయి. ఒక టెస్టు డ్రా గా ముగిసింది. ఇప్పుడీ సిరీస్‌తో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో సైకిల్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌కూ కెప్టెన్‌గా రోహిత్ శర్మ వ్యవహరించనున్నారు. జూన్-జులై 2025 మధ్య భారత మహిళల జట్టు కూడా ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. మూడు వన్డేలు, ఐదు టీ20లను ఆడనుంది.
**షెడ్యూల్ ఇదే..**
తొలి టెస్ట్ - 2025 జూన్ 20 నుంచి 24, వేదిక: లీడ్స్
రెండో టెస్ట్ - 2025 జులై 2 నుంచి 6, వేదిక: బర్మింగ్‌హామ్
మూడో టెస్ట్ - 2025 జులై 10 నుంచి 14, వేదిక: లండన్
నాలుగో టెస్ట్ - 2025 జులై 23 నుంచి 27, వేదిక: మాంచెస్టర్
ఐదో టెస్ట్ - 2025 జులై 31 నుంచి ఆగస్ట్ 4, వేదిక: లండన్

## వైసీపీకి మరో షాక్.. టీడీపీలో చేరిన కార్పొరేటర్లు!



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ కార్పొరేటర్లు ముగ్గురు టీడీపీలో చేరారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో మైలవరపు మాధురి లావణ్య, మైలవరపు రత్నకుమారి, హర్షద్ టీడీపీ కండువా కప్పుకున్నారు.
ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ.. బెజవాడలో చాలా మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నగర అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికే స్వాగతం పలుకుతామన్నారు. విజయవాడలో 2014 నుంచి 2019 వరకు జరిగిన అభివృద్ధి మళ్ళీ ఇపుడు కొనసాగిస్తామని తెలిపారు. ఎన్డీయే కూటమి బెజవాడలో ప్రతిపక్ష పార్టీల నామ రూపాలు లేకుండా చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీని విజయవాడకు కంచు కోటగా మార్చి చూపిస్తామని అన్నారు.
ఈ క్రమంలోనే చంద్రబాబుకు కుటుంబం కంటే రాష్ట్రమే ముఖ్యమన్నారు మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషిని అందరూ అభినందించాలన్నారు. విజయవాడలో వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందని. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ త్వరలోనే టీడీపీ కైవసం చేసుకుంటుందన్నారు. జగన్ ఐదేళ్లగా విజయవాడ నగర అభివృద్ధిని పట్టించుకోలేదని. చంద్రబాబు ఆధ్వర్యంలో విజయవాడ నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు.

## ఏపీలో 24 మంది మున్సిపల్

**అమరావతి( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో 24 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా పలువురు కమిషనర్లను మాతృశాఖకు బదిలీ చేయగా, మరికొందరిని మున్సిపల్ శాఖ డైరెక్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467